మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 6-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 218 Issue: 218

06 ఫిబ్రవరి 2026 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:50 సూర్యాస్తమయం - సా. 6:10 తిథి పంచమి రా. 1:22o వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం హస్త రా. 12:22o వరకు తరువాత చిత్తా యోగం ధృతి రా. 11:37 వరకు కరణం కౌలవ మ. 12:49 వరకు తైతుల రా. 1:22o వరకు వర్జ్యం ఉ. 7:51 నుండి ఉ. 9:33 వరకు దుర్ముహూర్తం ఉ. 9:06 నుండి ఉ. 9:51 వరకు మ. 12:52 నుండి మ. 1:38 వరకు రాహుకాలం ఉ. 11:05 నుండి మ. 12:30 వరకు యమగండం మ. 3:20 నుండి సా. 4:45 వరకు గుళికాకాలం ఉ. 8:15 నుండి ఉ. 9:40 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:14 నుండి ఉ. 6:02 వరకు అమృత ఘడియలు సా. 6:01 నుండి రా. 7:42 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:52 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




# ఆర్సీబీదే కప్

## స్మృతి మంధాన కెప్టెన్ ఇన్నింగ్స్

**జార్జియాతో కలిసి భారీ భాగస్వామ్యం.. ఢిల్లీ మళ్లీ ఢీలా.. నాలుగోసారీ నిరాశే**

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 టైటిల్‌ని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కైవసం చేసుకుంది. వడోదరాలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో విజయ కేతనం ఎగురవేసింది ఆర్సీబీ. వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు, ఈసారి కూడా టైటిల్‌కి అడుగుదూరంలో నిలిచిపోవాల్సి వచ్చింది. స్మృతి మంధాన కెప్టెన్సీలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మహిళా జట్టుకి ఇది రెండో టైటిల్. 2024 సీజన్‌లో ఆర్సీబీ తొలిసారి టైటిల్ గెలిచింది.

మ్యాచ్ వివరాల్లోకెళితే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ మహిళా జట్టు, నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 203 పరుగుల భారీ స్కోరు చేసింది. లీజెల్లీ లీ 30 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ 13 బంతుల్లో 3 ఫోర్లతో 20 పరుగులు చేసి అవుట్ అయ్యింది. లోరా వోల్వార్ట్ 25 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 44 పరుగులు చేసి రనౌట్ అయ్యింది. కెప్టెన్ తరువాయి 2 వ పేజీలో...



మనం తింటున్న ప్రతి బుక్క ఒక విషపు ముద్దనే. ప్రతిరోజూ మన పళ్లెంలో విషాన్ని వడ్డించుకుంటున్నాం. ఆ విషాన్నే తింటున్నాం. భారత్ హరిత విప్లవం ద్వారా ఆహార స్వయం సమృద్ధిని సాధించింది నిజమే కానీ, ఆ ప్రయాణంలో మనం కోల్పోయిన నాణ్యత ఇప్పుడు స్లో పాయిజన్ రూపంలో మన ప్రాణాలను తోడేస్తోంది. ఆహార భద్రత కంటే ఇప్పుడు ఆహార నాణ్యత అనేది పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. మనం రోజూ ఆరోగ్యంగా ఉండాలని తినే కూరగాయలు, ఆకుకూరలు రసాయనాల మిశ్రమంగా మారుతున్నాయి. అధిక దిగుబడి కోసం రైతులు, ఆకర్షణీయంగా కనిపించడం కోసం వ్యాపారులు అనుసరిస్తున్న పద్ధతులు ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.



# పళ్లెంలో విషం!



## తినేవన్నీ రసాయనాలే..

## కూరగాయల్లో పురుగుల మందులు

### అధిక దిగుబడికి ఆరాటం.. విచ్చలవిడి ఎరువుల వాడకం

**ఒంట్లోకి స్లో పాయిజన్.. దెబ్బతింటున్న ప్రజారోగ్యం**

**ఆవహిస్తున్న నాడీ, కిడ్నీ ఫెయిల్యూర్స్, క్యాన్సర్ రోగాలు**

**రైతుల్లో అవగాహనలేమి.. నిద్రపోతున్న ప్రభుత్వాలు**

వాస్తవానికి వ్యవసాయ రంగంలో నత్రజని, ఫాస్పరస్, పొటాషియం ఎరువులను నిర్ణీత నిష్పత్తిలో వాడాలి. కానీ, దిగుబడి పెంచాలనే ఆరాటంలో రైతులు వీటిని మితిమీరి వాడుతున్నారు. అధికంగా యూరియా వాడటం వల్ల కూరగాయల్లో నైట్రేట్ నిల్వలు పెరిగిపోతున్నాయి. అతిగా ఎరువులు వాడటం వల్ల భూమిలోని సహజ పోషకాలు నశించి, పంటలు కేవలం రసాయనాలపైనే ఆధారపడే పరిస్థితి వస్తోంది. పంటకు చీడపీడలు పట్టకుండా వాడే పురుగుమందుల ప్రభావం పంట కోసిన తర్వాత కూడా అలాగే ఉంటోంది. మందు కొట్టిన కొన్ని రోజుల వరకు పంట కోయకూడదు. కానీ, మార్కెట్ డిమాండ్ కోసం మందు కొట్టిన మరుసటి రోజే కూరగాయలను మార్కెట్‌కు తరలిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నిషేధించిన కొన్ని ప్రమాదకర రసాయనాలను కూడా మన దగ్గర ఇంకా వినియోగిస్తూనే ఉన్నారు.

(ఈవార్తలు - స్పెషల్ డెస్క్)

1960వ దశకంలో దేశంలో కరువును తరిమికొట్టడానికి ప్రవేశపెట్టిన అధిక దిగుబడి వంగడాలు, రసాయనిక ఎరువులు అప్పట్లో ఒక వరంగా కనిపించాయి. కానీ ఐదు దశాబ్దాల తర్వాత, ఆ వరమే శాపంగా మారింది. రసాయనిక ఎరువుల విచ్చలవిడి వాడకం వల్ల భూమిలోని సహజ సిద్ధమైన సూక్ష్మజీవులు నశించాయి. భూమి కేవలం 'ఇసుక తిన్నె'లా మారిపోయింది. దానికి ఎరువులు ఇస్తే తప్ప పంట పండని స్థితికి చేరుకుంది. కూరగాయలు త్వరగా పెరగడానికి, ఆకర్షణీయంగా కనిపించడానికి చేసే ప్రయత్నాలు మరీ దారుణంగా ఉన్నాయి. సొరకాయ, పొట్లకాయ -2 వ పేజీలో...

### మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**శుభ్రపరచడం:** కూరగాయలను వండే ముందు కనీసం 15-20 నిమిషాలు ఉప్పు నీటిలో లేదా వెనిగర్ కలిపిన నీటిలో నానబెట్టి కడగాలి.

**సీజనల్ కూరగాయలు:** ఆయా కాలాల్లో దొరికే కూరగాయలనే ఎంచుకోవడం వల్ల రసాయనాల ప్రభావం కొంత తక్కువగా ఉంటుంది.

**సేంద్రియ వ్యవసాయం:** సాధ్యమైనంత వరకు ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రోత్సహించడం లేదా ఇంటి డాబాపై చిన్న పాటి కూరగాయల మొక్కలు పెంచుకోవడం ఉత్తమం.

**అవగాహన:** మరీ మిరుమిట్లు గొలిపే రంగులో ఉండే కూరగాయల కంటే, సహజంగా ఉండే వాటిని ఎంచుకోవాలి.



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,442 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,961 |



# సోనియా వల్లే తెలంగాణ

**ఇవ్వొద్దని ఏపీ పెట్టుబడిదారులు ఒత్తిడి**

**అయినా పట్టువదలని కాంగ్రెస్ అధినేత్రి**

**పొన్నం లాంటి వాళ్ల పోరాటం, త్యాగం**

**కరీంనగర్ జిల్లా సభలో సీఎం రేవంత్**

చొప్పదండి/కరీంనగర్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చిన తీర్పును సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన మోసాలను, కాంగ్రెస్ తెచ్చిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. సోనియా గాంధీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రాణాలకు తెగించి తెలంగాణ ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, 2004లో ఇదే జిల్లాలో సోనియా గాంధీ తెలంగాణ ప్రకటన చేశారని, ఆ మాటను తరువాయి 2 వ పేజీలో...

# పంచాయతీలకు 260 కోట్లు



**15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల**

**కొత్త సర్పంచ్‌లకు భారీ గుడ్‌న్యూస్**

**రావాల్సిన మొత్తం నిధులు 3,000 కోట్లు**

తెలంగాణలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. ఎప్పటి నుంచో గ్రామ పంచాయతీలకు రావాల్సిన బకాయిలకు సంబంధించి కీలక ప్రకటన వెలువరించింది. 15వ ఆర్థిక సంఘం నిధులను తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. తొలి విడతలో భాగంగా రూ.259.36 కోట్లను విడుదల చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడంతో.. ఇన్ని రోజులుగా ఈ 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు విడుదల చేసింది.

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): పంచాయతీల పదవీ కాలం పూర్తి అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించకపోవడంతో నిధుల విడుదలను కేంద్రం నిలిపివేసింది. రాష్ట్రంలో గ్రామ పంచాయితీలకు ఎన్నికలు ఆలస్యం కావడంతో 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల ఆగిపోయింది. ఈ క్రమంలోనే కొన్ని రోజుల క్రితం తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఆ ఎన్నికల ఫలితాలు వెలువడి.. గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పాటు అయ్యాయి. అయితే కొత్తగా తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



రైళ్లకు ఇబ్బందులు తలెత్తకుండా, రైలు పట్టాల మధ్య సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తోంది స్విట్జర్లాండ్ ప్రభుత్వం. అవసరం లేదనుకుంటే తొలగించేలా వాటిని బిగిస్తోంది. మొత్తం 5 వేల కిలోమీటర్ల మేర వీటిని ఏర్పాటు చేయనున్నట్లు అక్కడి ప్రభుత్వం పేర్కొంది.

# ఫుల్ టైం డీజీపీ ఎక్కడ?



**నాలుగు వారాల్లో తేల్చండి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**

నాలుగు వారాల్లో తెలంగాణ డీజీపీ నియామకంపై తేల్చాలని యూపీఎస్సీని సుప్రీంకోర్టు ఆదేశించింది. తెలంగాణ డీజీపీ నియామకంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. నాలుగు వారాల్లో డీజీపీ నియామకంపై యూపీఎస్సీ తగిన సిఫార్సులు చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది.

న్యూఢిల్లీ: అధికారుల యోగ్యత ఆధారంగా సిఫారసులు చేయాలన్న ధర్మాసనం.. సకాలంలో యూపీఎస్సీకి ప్రతిపాదిత డీజీపీ పేర్లను పంపడంలో తెలంగాణ సహా అనేక రాష్ట్రాలు ఆలస్యం చేస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఈ ఆలస్యం వల్ల మెరిట్ ఉన్న అధికారులకు అన్యాయం జరుగుతుందన్న సుప్రీంకోర్టు.. యాక్టింగ్ డీజీపీ పేరుతో రెగ్యులర్ డీజీపీని నియమించడం లేదని పేర్కొంది. 'రాష్ట్రాలు ప్రతిపాదనలు ఆలస్యం చేస్తే.. త్వరగా ప్రతిపాదనలు పంపాలని అన్ని రాష్ట్రాలకు యూపీఎస్సీ లేఖలు రాయాలి. రాష్ట్ర తరువాయి 2 వ పేజీలో...

# గ్రూప్-1 నియామకాలకు లైన్ క్లియర్



**హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులు రద్దు.. డివిజన్ బెంచ్ కీలక తీర్పు**

తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష విషయంలో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. గ్రూప్-1 నియామకాలపై స్టే విధిస్తూ గతంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సీజే నేతృత్వంలోని డివిజన్ బెంచ్ గురువారం రద్దు చేసింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): దీంతో గ్రూప్ -1 పరీక్షలో ఎంపికై నియామక పత్రాలు పొందిన పొందిన అభ్యర్థులకు భారీ ఊరట లభించింది. వివరాలు... తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 563 పోస్టుల భర్తీకి గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2024 అక్టోబర్‌లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహించింది. ఆ తర్వాత ఫలితాలను సైతం ప్రకటించింది. అయితే గ్రూప్-1 తరువాయి 2 వ పేజీలో...



# హనీమూన్ హత్య 2.0

**వాకింగ్‌కి తీసుకెళ్లి చంపించిన పెళ్లికూతురు**

**హిట్ అండ్ రన్.. ప్రియుడితో కలిసి భర్త హత్య**

## రాశి ఫలాలు

6.2.2026

మేషం: ఇంటాబయట బాధ్యతలు పెరిగిన సమర్థవంతంగా నిర్వహిస్తారు. గృహమునకు ఆప్తులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆర్థిక పరిస్థితి కొంత అనుకూలిస్తుంది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో పనితీరుతో అధికారులను ఆకట్టుకుంటారు. వ్యాపారమున లాభాలు అందుకుంటారు.

వృషభం: దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ముఖ్యమైన వ్యవహారాల్లో కార్యసిద్ధి కలుగుతుంది. కొన్ని వ్యవహారాలలో తీసుకున్న నిర్ణయాలు మానసికంగా ఆనందం కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

మిథునం: ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు ఆశాజనకంగా సాగుతాయి. దూరప్రాంత బంధుమిత్రుల నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. నూతన కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. సోదరులతో శుభకార్యాలు గూర్చి చర్చిస్తారు. వృధా ఖర్చుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది.

కర్కాటకం: చిన్ననాటి మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. స్థిరాస్తి వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి. అనారోగ్య సమస్యల నుండి బయటపడతారు. జీవిత భాగస్వామి నుండి శు భవార్తలు అందుతాయి. ఇంటా బయట ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. నిరుద్యోగుల ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

సింహం: కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. సంతానం విద్యా విషయాలలో శు భవార్తలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఋణాలు కొంత వరకు తొలగుతాయి. నూతన వస్త్ర వస్తు లాభాలు పొందుతారు. కొన్ని వ్యవహారాలలో ధైర్యంగా వ్యవహరించి అందరి మన్ననలు పొందుతారు.

కన్య: చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. నూతన వ్యాపార ప్రారంభానికి ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల నుండి అవసరానికి ధన సహాయం లభిస్తుంది. కుటుంబ సభ్యుల నుండి శు భవార్తలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారు. వ్యాపారాలు లాభిస్తాయి.

తుల: దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. భాగస్వామ్య వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. సోదరుల నుండి ఆశించిన సహాయం లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిదికాదు. అధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి.

వృశ్చికం: నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఇతరుల విషయంలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. జీవిత భాగస్వామి నుండి కీలక సమాచారం అందుతుంది. వృత్తి ఉద్యోగాలలో సమస్యలు ఎదురైనప్పటికీ నిదానంగా పరిష్కరించుకుంటారు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది.

ధనస్సు: పాత మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాల్లో స్వల్ప లాభాలు అందుకుంటారు. ఇంటాబయట సమస్యలను అధిగమించి ముందుకు సాగుతారు. దైవ సేవా కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. ఉ ద్యోగస్తులు ఉన్నత పదవులు పొందుతారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

మకరం: బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. నూతన కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి, ఉ ద్యోగాల్లో సహోద్యోగుల నుండి శుభవార్తలు అందుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

కుంభం: వృత్తి వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. భూ సంభందిత క్రయవిక్రయాల్లో లాభాలు అందుకుంటారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ముఖ్య వ్యవహారంలో ఆర్థిక సాయం అందుతుంది. ఉద్యోగమున అధికారులతో చర్చలు అధిగమిస్తారు.

మీనం: స్థిరాస్తి విషయంలో సోదరులతో నూతన ఒప్పందాలు కుదురుతాయి. ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు కలుగుతాయి. గృహమున శు భకార్యాల ప్రస్తావన వస్తుంది. ఆర్థిక వ్యవహారాలు కలసివస్తాయి. వాహన యోగం ఉన్నది. వృత్తి ఉ ద్యోగాలలో సమయ పాలనతో పనులు పూర్తి చేస్తారు.

# పళ్లెంలో..విషం!

మొదటి పేజీ తరువాయి

వంటివి రాత్రికి రాత్రే పెరగడానికి ఈ హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు. వ్యాపారులు పాతబడిన కూరగాయలు తాజాగా కనిపించడానికి మలాకైట్ గ్రీన్ వంటి రసాయన రంగుల్లో ముంచుతున్నారు.

### దెబ్బతింటున్న అవయవాలు

మనం వాడే పురుగుమందులు కేవలం పురుగులను చంపి ఆగిపోవడం లేదు. అవి మొక్క కణజాలంలోకి ప్రవేశిస్తాయి. పొలాల్లో చల్లే ఎరువులు వర్షపు నీటితో కలిసి నదులు, చెరువులు మరియు భూగర్భ జలాల్లోకి చేరుతున్నాయి. ఆ పంట వ్యర్థాలను తిన్న పశువుల పాలు కూడా విషతుల్యమవుతున్నాయి. చివరగా ఈ ఆహారం తీసుకునే మనిషి శరీరంలో ఈ రసాయనాలు 'బయో–అక్యుములేషన్' పద్ధతిలో నిల్వ ఉ ండిపోతాయి. ఇవి ఒక రోజులో చంపవు, కానీ ఏళ్ల తరబడి శరీరంలో ఉండి అవయవాలను లోలోపలే కుళ్లింపజేస్తాయి. మన దేశంలో క్యాన్సర్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఒక ప్రత్యేక క్యాన్సర్ రైలు నడుస్తోందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రక్తంలోని విషాలను వడకట్టే కిడ్నీలు ఈ రసాయనాల ధాటికి తట్టుకోలేక విఫలమవుతున్నాయి. సంతానలేమి సమస్యలు గత 20 ఏళ్లలో 400% పెరిగాయి. పురుషుల్లో వీర్యకణాల సంఖ్య తగ్గడానికి, మహిళల్లో పీసీఓడీ సమస్యలకు ఈ రసాయన ఆహారమే ప్రధాన కారణం. పురుగుమందుల అవశేషాలు నాడీ వ్యవస్థను దెబ్బతీసి డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలను పెంచుతున్నాయి.

### మేల్కొనాల్సిన సమయం

మనం ఇప్పుడు మేల్కోకపోతే, భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే ఆస్తి ఆసుపత్రి బిల్లులు మాత్రమే అవుతాయి. సుభాష్ పాలేకర్ వంటి వారు ప్రచారం చేస్తున్న దేశీ ఆవు ఆధారిత వ్యవసాయం వైపు రైతులను మళ్లించాలి. రసాయనాలపై సబ్సిడీలు తగ్గించి, సేంద్రియ ఎరువులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. మార్కెట్లలో రసాయన పరీక్షల ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి. కనీసం మనకు కావాల్సిన ఆకుకూరలు, మిర్చి వంటివి ఇంటి డాబాపై పెంచుకోవడం ద్వారా కొంతవరకు విషం నుండి తప్పించుకోవచ్చు. కూరగాయలను వండే ముందు ఉ ప్పు, పసుపు లేదా బేకింగ్ సోడా కలిపిన నీటిలో శుభ్రం చేయడం అలవాటు చేసుకోవాలి.

### రసాయనాలు.. సమస్యలు

నైట్రేట్లు: రక్తంలో ఆక్సిజన్ స్థాయిని తగ్గిస్తాయి.

పురుగుమందులు: నాడీ వ్యవస్థ దెబ్బతినడం, జ్ఞాపకశక్తి తగ్గడం, పార్కిన్సన్స్ వచ్చే అవకాశం.

హార్మోన్ ఇంజెక్షన్లు: చిన్న పిల్లల్లో అకాల యవ్వనం, సంతానలేమి సమస్యలు.

గ్లైఫోసేట్ (కలుపు మందు): క్యాన్సర్ కారకం, కిడ్నీ వైఫల్యం.

ఆక్సిటోసిన్ (ఎదుగుదల కోసం) : హార్మోన్ల అసమతుల్యత, చిన్నపిల్లలు త్వరగా పెద్దవారిగా మారడం.

మలాకైట్ గ్రీన్ (రంగు కోసం): కాలేయం దెబ్బతినడం, గర్భస్రావాలు.

కాల్షియం కార్బైడ్ (పండ్లు మగ్గబెట్టడానికి): నాడీ వ్యవస్థపై ప్రభావం, మెదడు వాపు.

ఎండోసల్ఫాన్ (పురుగు మందు): నాడీ సంబంధిత లోపాలు, పుట్టుకతో వచ్చే వైకల్యాలు.




# ఆర్సీబీదే కప్

మొదటి పేజీ తరువాయి

జెమీమా రోడ్రిగ్స్ 37 బంతుల్లో 8 ఫోర్లతో 57 పరుగులు చేసింది. చిన్నెల్లీ హెన్రీ 15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 పరుగులు చేసింది. భారీ లక్ష్యఛేదనో గ్రేస్ హారీస్ వికెట్‌ని ఆదిలోనే కోల్పోయింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు. 7 బంతుల్లో 2 ఫోర్లతో 9 పరుగులు చేసిన గ్రేస్ హారీస్‌ని చిన్నెల్లీ హెన్రీ అవుట్ చేసింది. అయితే కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వాల్ కలిసి రెండో వికెట్‌కి 165 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. జార్జియా వాల్ 54 బంతుల్లో 14 ఫోర్లతో 79 పరుగులు చేసి అవుట్ అయ్యింది. కెప్టెన్ స్మృతి మంధాన 41 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్సర్లతో 87 పరుగులు చేసింది. రిచా ఘోష్ 6 పరుగులకే అవుట్ కావడంతో ఉత్కంఠ రేగింది. ఆర్‌సీబీ విజయానికి చివరి ఓవర్‌లో 10 పరుగులు అవసరం అయ్యాయి. మొదటి బంతికి రాధా యాదవ్ సింగిల్ తీయగా రెండో బంతికి మరో సింగిల్ వచ్చింది. మూడో బంతికి ఫోర్ బాదిన రాధా యాదవ్, ఆ తర్వాతి బంతిని కూడా బౌండరీకి తరలించి, మ్యాచ్‌ని ముగించేసింది.

# గ్రూప్-1 నియామకాలకు లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి

మెయిన్స్ పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లపై విచారణ జరిగిన హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం... ఫలితాలు రద్దుచేసి, తిరిగి మూల్యాంకనం చేయాలని తీర్పు ఇచ్చింది. మెయిన్స్ సమాధాన పత్రాలను తిరిగి ముల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని, అలా చేయలేకపోతే మెయిన్స్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని సింగిల్ బెంచ్ పేర్కొంది. అయితే సింగిల్ బెంచ్ ఉత్తర్వులను టీజీపీఎస్సీ, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన పలువురు అభ్యర్థులు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాలు చేశారు. ఈ నేపథ్యంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను హైకోర్టు డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. నియామకాలు తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని పేర్కొంది. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ –1 పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు జారీ చేయడంలో ముందుకు సాగేందుకు అనుమతి లభించింది. అదే సమయంలో ఈ నియామకాలు టీజీపీఎస్సీ, ఇతర పిటిషనర్లు దాఖలు చేసిన రిట్ అప్పీళ్లపై తుది తీర్పునకు లోబడి ఉంటాయని కూడా స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే గ్రూప్ –1కు ఎంపికైన 562 మంది అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వం నియామక పత్రాలను కూడా అందజేసింది. అయితే తాజాగా గ్రూప్ –1 నియామకాలపై సింగిల్ జడ్జి తీర్పును సీజే ధర్మాసనం రద్దు చేసింది. దీంతో గ్రూప్–1 ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు భారీ ఊరట లభించింది.

# ఫుల్ టైం డీజీపీ ఎక్కడ?

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాలు ప్రతిపాదనలు సకాలంలో పంపకపోతే కమిషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించకపోతే తగిన పరిణామాలను ఎదుర్కోక తప్పదు' అని సుప్రీంకోర్టు హెచ్చరించింది.

# సోనియా వల్లే తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

నిలబెట్టుకునే క్రమంలో పార్టీని సైతం పణంగా పెట్టారని గుర్తుచేశారు. మరోవైపు, జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులతో జరిగిన సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో గెలుపునకు డబ్బు కొలమానం కాదని, ప్రజల నమ్మకమే నిజమైన పెట్టుబడి అని దిశానిర్దేశం చేశారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన విధ్వంసాన్ని, కాంగ్రెస్ తెచ్చిన మార్పును ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో సోనియా గాంధీ చూపిన తెగువను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ నష్టపోతుందని తెలిసినా, కేంద్రంలో అధికారం కోల్పోయే ప్రమాదం ఉన్నా, ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రాన్ని ప్రకటించారని కొనియాడారు. ఆనాడు ఏపీ పెట్టుబడిదారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు వచ్చినా ఆమె చలించలేదని అన్నారు. పార్లమెంటులో పెప్పర్ స్ప్రే దాడులను సైతం లెక్కచేయకుండా పొన్నం ప్రభాకర్ వంటి నేతలు చేసిన పోరాటాన్ని, వారి త్యాగాలను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ కార్యకర్తలకు, అభ్యర్థులకు సీఎం నూతనోత్సాహాన్ని నింపారు. టికెట్ కోసం తీవ్ర పోటీ ఉ న్నప్పటికీ, పార్టీ అధిష్టానం నమ్మి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ దక్కని నాయకులను కలుపుకొని పోవాల్సిన బాధ్యత అభ్యర్థులదేనని స్పష్టం చేశారు. ఒక్క ఓటు కూడా ఫలితాన్ని తారుమారు చేస్తుందని, అందుకే అలసత్వం వద్దని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఇవ్వని రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలే కాంగ్రెస్ విజయానికి నాంది అని తెలిపారు. మనం చేసిన పనులే ప్రజలకు చెప్పాలని, అబద్ధాలు ఆడాల్సిన అవసరం మనకు లేదని హితవు పలికారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలన కేవలం ఆస్తులు కూడబెట్టుకోవడానికే పరిమితమైందని రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు గానీ, దళితులకు మూడు ఎకరాల భూమి గానీ ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిన చరిత్ర కాంగ్రెస్‌దని గుర్తుచేశారు. ఉచిత విద్యుత్ పథకంపై పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీదేనని, రైతులపై కేసులు ఎత్తివేసి, విద్యుత్ బకాయిలు రద్దు చేసిన ఘనత తమకే దక్కుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక ప్రతిపక్షం విషం చిమ్ముతోందని మండిపడ్డారు.

# పంచాయతీలకు 260 కోట్లు

మొదటి పేజీ తరువాయి

ఎన్నికైన సర్పంచ్‌లు.. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేర్చుదామంటే ఖజానా ఖాళీగా ఉండటంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఈ నేపథ్యంలోనే తాజాగా తొలి విడత నిధులు రిలీజ్ కావడంతో భారీ ఊరట కలిగింది. పంచాయతీ ఎన్నికలు పూర్తికావడం.. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేయడంతో ఈ నిధులను విడుదల చేసింది అయితే 15వ ఆర్థిక సంఘం నిధుల కింద.. కేంద్రప్రభుత్వం మొత్తం రూ.3 వేల కోట్ల వరకు తెలంగాణకు ఇవ్వాల్సి ఉండగా.. మొదటి విడతలో భాగంగా ఈ రూ.259.36 కోట్లను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ రూల్స్ ప్రకారం.. ప్రజల చేత ఎన్నికైన సర్పంచ్‌లు ఉంటేనే ఈ ఆర్థిక సంఘం నిధులను నేరుగా గ్రామ పంచాయతీ అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్ చేస్తారు. ఈ నిధులను గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు వినియోగించాల్సి ఉంటుంది. గ్రామాల్లో మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతర అవసరాల కోసం ఖర్చు చేయనున్నారు.

# హనీమూన్ హత్య 2.0

## వాకింగ్‌కి తీసుకెళ్లి చంపించిన కొత్త పెళ్లికూతురు.. హిట్ అండ్ రన్.. ప్రియుడితో కలిసి భర్త హత్య

జైపూర్: గతేడాది మేఘాలయకు హనీమూన్ కోసం తీసుకెళ్లి భర్తను ప్రియుడితో చంపించిన సోనమ్ గురించి అందరికీ తెలిసిందే. అప్పట్లో ఈ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. ఇప్పుడు ఇలాంటి ఘటనే మరో చోట జరిగింది. ముఖ్యంగా రాజస్థాన్‌లో అనేక అనుమానాలకు తావిచ్చిన 'హిట్ అండ్ రన్' కేసు చివరకు అత్యంత దారుణమైన కుట్రగా వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా నవ వధువే.. వాకింగ్ తీసుకెళ్లి మరీ తన భర్తను ప్రియుడితో చంపించినట్లు తేలింది. మేఘాలయలో గతంలో జరిగిన 'హనీమూన్ మర్డర్' తరహాలోనే ఈ ఘటన ఉండటంతో దీనిని 'రాజస్థాన్ హనీమూన్ మర్డర్ 2.0'గా పోలీసులు అభివర్ణిస్తున్నారు. జనవరి 30వ తేదీ రాత్రి రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ సమీపంలోని రోడ్డుపై ఆశిష్, అంజు అనే దంపతులు నడుచుకుంటూ వెళ్తున్నారు. అప్పుడే ఓ గుర్తుతెలియని వాహనం వచ్చి వారిని ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆశిష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆయన భార్య అంజు స్పృహ తప్పి పడిపోయింది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అలాగే అంజును లేపే ప్రయత్నం చేశారు. ఈక్రమంలోనే ఆమె స్పృహలోకి రాగా ఏం వచ్చిందని ఆరా తీశారు. అప్పటికే పోలీసులు కూడా రావడంతో, అంజు జరిగింది చెప్పింది. ఎవరో వాహనంతో ఢీకొట్టి తన ఒంటిపై ఉన్న బంగారు నగలను దోచుకెళ్లారని నమ్మబలికింది. ఈక్రమంలోనే తన భర్త ప్రాణాలు కోల్పోయాడని వివరించింది. కానీ పోలీసులకు అంజు మాటల్లో నిజం కనిపించలేదు. ఆమె ఏదో దాస్తోందని అనుమానం వచ్చింది. అది మాత్రమే కాకుండా ఆశిష్ శరీరంపై వాహనం ఢీకొట్టిన గాయాల కంటే కూడా ఎవరో గొంతు నులిమిన ఆనవాళ్లే ఎక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా భర్త అంత దారుణంగా చనిపోయినా.. పక్కనే ఉన్న అంజుకు కనీసం చిన్న గీత కూడా పడకపోవడం పోలీసులను విస్మయానికి గురిచేసింది. వీటన్నింటితో ఆమెపై అనుమానం మరింత పెరగ్గా.. పోలీసులు ఆమెపై నిఘా పెట్టారు. ముఖ్యంగా కాల్ డేటాను పరిశీలించారు. ఈక్రమంలోనే తన ఇంటి పక్కనే ఉండే సంజు అనే పాత ప్రియుడితో నిరంతరం టచ్‌లో ఉన్నట్లు తేలింది. ఈక్రమంలోనే ఆమెను పోలీసులు తమదైన స్టైల్లో విచారించగా అసలు నిజం వెలుగులోకి వచ్చింది. తానే ప్రియుడి కోసం ప్రియుడి చేతనే ఆశిష్‌ను చంపించినట్లు వివరించింది. అసలేం జరిగిందంటే.. మూడు నెలల క్రితమే అంజు, ఆశిష్‌లకు పెళ్లి కాగా.. పెళ్లయిన కొత్తలోనే భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లింది అంజు. అక్కడే తన పాత ప్రియుడు సంజుతో మళ్లీ బంధాన్ని తిరిగి ప్రారంభించింది. కానీ అప్పటికే ఆశిష్ వచ్చి ఆమెను తిరిగి ఇంటికి తీసుకెళ్లాడు. అయితే భర్త కంటే ప్రియుడే ఎక్కువగా నచ్చడంతో.. అతడితోనే కలిసి జీవితాన్ని పంచుకోవాలనుకుంది. ఇదే విషయాన్ని సంజుకు కూడా చెప్పగా.. అతడు కూడా ప్రియురాలితోనే కలిసి జీవించేందుకు ఆసక్తి చూపించారు. అయితే నేను నీకు దక్కాలంటే ముందు నా భర్తను చంపాలని అంజు.. సంజుకు చెప్పగా అతడు కూడా అందుకు ఒప్పుకున్నాడు. ఇలా వీరిద్దరూ ఆశిష్‌ను చంపేందుకు పథకం వేశారు. ఈ పథకంలో భాగంగానే.. అంజు ప్రతిరోజూ రాత్రి భర్తను వాకింగ్‌కు తీసుకెళ్లేది. అలా జనవరి 30వ తేదీన కూడా.. అంజు ఆశిష్‌ను జనం లేని మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లింది. అప్పటికే అక్కడ పొదల్లో నక్కి ఉన్న సంజు, అతని అనుచరులు రాకీ, బాదల్ ఒక్కసారిగా ఆశిష్‌పై దాడి చేశారు. అతని గొంతు నులిమి ప్రాణం తీసిన అనంతరం.. దానిని ప్రమాదంగా నమ్మించడానికి అంజు తన ఫోన్, నగలను నిందితులకు ఇచ్చేసి తాను కూడా రోడ్డుపై పడిపోయింది. కానీ అంజుకు గాయాలు కాకపోవడం, భర్త చావుతో ఏమాత్రం బాధ పడకపోవడంతో పోలీసలు నిజాన్ని గుర్తించారు. అంజు చేతే అన్ని విషయాలు చెప్పించి.. ఆమెతో పాటు ఆమె ప్రియుడు, మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.



# బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్లు

## హుజూరాబాద్‌లో బండి సంజయ్ ప్రకటన.. మినీ స్టేడియం నిర్మిస్తామని హామీ

హుజూరాబాద్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. హుజూరాబాద్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.259 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్నేళ్లుగా హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం వందల కోట్ల రూపాయలు తీసుకొచ్చామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని పరికరాలను తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అవసరమైన సిబ్బందిని నియమించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హుజూరాబాద్ అభివృద్ధికి పైసా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మినీ స్టేడియం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అన్ని రకాల పన్నులు పెంచుతారని ఆరోపించారు. రాబోయే బడ్జెట్‌లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఇతర హామీల్లాగే ఇదీ ఉందని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మాత్రమే తెలంగాణకు ఇళ్లు వచ్చాయని అన్నారు. కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి చర్లపల్లి జైలులో రెండు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని, కానీ ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి కూడా కదిలించలేకపోయారని అన్నారు. అటు.. తెలంగాణలోని గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి రూ.259 కోట్ల నిధులు తీసుకువచ్చామని బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కిషన్ రెడ్డి, తాను నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ నిధులు తెచ్చామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలతో సరిపెట్టదని, కిందిస్థాయి వరకు నిధులు చేరుతాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నిధులు ఇంతటితో ఆగవని, దశలవారీగా వస్తూనే ఉంటాయని అన్నారు. అభివృద్ధి చేసే పార్టీలకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.



## సిరిసిల్ల జిల్లా తీసేసేందుకు

# రేవంత్ కుట్ర

### ఆ పార్టీకి ఓటేస్తే మనకే చేటు: కేటీఆర్

సిరిసిల్ల, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): అధికార కాంగ్రెస్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేటీఆర్... మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతుబంధు వేస్తానని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారు, కానీ ఇప్పటికీ ఎన్ని పంట కాలాలు గడిచాయి? ఎన్నిసార్లు రైతుబంధు వేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికలు రైతుబంధు రైతన్నల ఖాతాలో వేయడానికి ముఖ్యమంత్రికి ఏ విధంగా అడ్డు వస్తున్నాయని ప్రశ్నించారు. కేవలం ఎన్నికలు అయిపోయేంత వరకు ఆశ చూపించి... మరొకసారి రైతులను మోసం చేయడానికే రేవంత్ రెడ్డి రైతుబంధుపై అబద్ధపు మాటలు చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి కార్యక్రమాలను కూడా పక్కన పెట్టారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపణలు చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేస్తే, మరొక్కసారి ప్రజలను మోసం చేయడం ఖాయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పుడు మాజీ సీఎం కేసీఆర్ గారిని తిట్టవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చేతనైతే ప్రజలకు మంచి చేయాలి, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి అంశంలో అడ్డగోలుగా మాట్లాడటం, అబద్ధాలు ఆడటం తప్పించి... ఈ రెండు ఏండ్లలో ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. జిల్లాలు ఎత్తివేస్తామని కాంగ్రెస్ పార్టీ చెబుతుందని... అలాంటి పార్టీకి ఓటు వేస్తే అది మంచా, చెడ్డా అన్న విషయాన్ని ఓటర్లు ఆలోచించుకోవాలని కోరారు. ఈ మున్సిపల్ ఎన్నికల గత 10 సంవత్సరాల పాటు ప్రజలకు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీకి, రెండేళ్లలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య పోటీ అని అన్నారు. తెలంగాణలో మరోసారి కేసీఆర్ గారిని ముఖ్యమంత్రిని చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని అన్నారు. ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే అడుగులు వేయాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే... మరో మూడు సంవత్సరాల వరకు ప్రజలకి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే అధికారం, అవకాశం రాదని అన్నారు.



## నేటి నుంచి 'గద్దర్' చిత్రాల ప్రదర్శన

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): ప్రజా గాయకుడు, విప్లవకారుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్'ను ఏర్పాటు చేయడం తెలిసిందే. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో జరగనున్న ఈ అవార్డుల ప్రక్రియలో భాగంగా చిత్రాల ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, రోడ్ నెం. 2లో ఉన్న ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరుకానున్నారు. టీఎఫ్‌డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు సారథ్యంలో ఈ అవార్డుల వేడుక జరగనుంది. గద్దర్ పేరు మీద అవార్డులను అందించడం ద్వారా ఆయనకు ఘన నివాళి అర్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ చిత్రాల ప్రదర్శనతో అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలు కానుంది.

## రేవంత్ హార్వర్డ్ సర్టిఫికెట్ వెనక్కి తీసుకోవాలి

**వర్సిటీకి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లేఖ**

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ఇటీవల జారీ చేసిన సర్టిఫికెట్‌పై తీవ్ర వివాదం రేగింది. ఈ సర్టిఫికెట్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, అదే యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గురువారం హార్వర్డ్ అధ్యక్షుడికి, డీన్‌కు ఘాటైన ఈ-మెయిల్ పంపారు. దేశంలోనే అత్యధికంగా 89 క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న, ఓటుకు నోటు కేసులో ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికి జైలు జీవితం గడిపిన వ్యక్తికి హార్వర్డ్ సర్టిఫికెట్ ఇవ్వడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ కుమార్ తన లేఖలో సీఎం రేవంత్ రెడ్డి ట్రాక్ రికార్డును ప్రస్తావిస్తూ తీవ్రమైన ఆరోపణలు చేశారు. "దేశంలో ఏ ముఖ్యమంత్రి ఎదుర్కోనన్ని క్రిమినల్ కేసులు (89) ఎదుర్కొంటూ, ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి దొరికి, దాదాపుగా 50 రోజులు జైలులో గడిపి, ఇప్పుడు సీఎంగా పలు కుంభకోణాలకు పాల్పడుతూ, తెలంగాణ ప్రజల మీద ప్రతీకారం తీర్చుకుంటున్నారు. ప్రతిచోటా ప్రత్యర్థులపై అభ్యంతరకరమైన భాషను ప్రయోగిస్తున్న ఇలాంటి రాజకీయ నాయకుడు 21వ శతాబ్దానికి పనికిరాడు. ప్రాచీన రాతి యుగంలో కూడా ఇలాంటి నాయకులు ఉండి ఉండరు. ఇంతటి ట్రాక్ రికార్డు ఉన్న నాయకుడికి హార్వర్డ్ యూనివర్సిటీ సర్టిఫికెట్ ఇవ్వడం దేనికి సంకేతం?" అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తాను హార్వర్డ్‌కు పంపిన ఈ-మెయిల్ సారాంశాన్ని ఆయన మీడియాకు విడుదల చేశారు.

## యాదాద్రి జిల్లాలో పులి భయం

**మహారాష్ట్ర నుంచి సిద్దిపేట మీదుగా జిల్లాకు**

భువనగిరి, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో పులి సంచారం కలకలం రేపుతోంది. మహారాష్ట్ర అడవుల నుంచి ఈ పెద్దపులి వచ్చిందని అనుమానిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ ప్రాంతంలో కనిపించిన పులి సంచారం, ఇప్పుడు యాదాద్రి భువనగిరి జిల్లాలో కలకలం రేపుతోంది. గత ఇరవై రోజుల్లో ఈ పులి పలు లేగదూడలను చంపింది. రాజాపేట, యాదగిరిగుట్ట, ఆలేరు, గుండాల, తుర్కపల్లి ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. మూటకొండూరు మండలంలో పులి ఆనవాళ్లను గుర్తించారు. రాత్రి మండలంలోని అనంతారంలో ఒక లేగదూడను చంపేసింది. మహారాష్ట్ర అడవుల్లో నుంచి తెలంగాణలోకి వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. కాగా, ఈ పులిని జాడను గుర్తించేందుకు ఆదిలాబాద్ నుంచి అనిమల్ ట్రాకర్స్ వచ్చినట్లు యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు నిన్న తెలిపారు. ఈ పులి యాదాద్రి భువనగిరి నుంచి తిరిగి వెనక్కి వెళుతున్నట్లుగా అర్థమవుతోందని అన్నారు. పులి సంచారాన్ని గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి మన ప్రాంతం నుంచి వెళ్లిపోయిందని స్పష్టమైన సమాచారం వచ్చే వరకు జాగరూకతగా ఉండాలని అన్నారు. పులి సంచారం నేపథ్యంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులది ప్రధాన బాధ్యత అన్నారు. జనగామలో పులి సంచారం వార్తలపై సీఐ సత్యనారాయణ రెడ్డి స్పందించారు.

## బీజేపీతోనే తెలంగాణ రక్ష: కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): తెలంగాణను రక్షించుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇన్నాళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని, ఏపీలో విమానాశ్రయాలు ఉన్నాయి కానీ తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, తెలంగాణ నుంచే డబ్బులు వెళుతున్నాయని ఆరోపించారు.

## మేడారం జాతరలో బాలికపై అత్యాచారం వట్టిదే

### తేల్చిన జాతీయ మహిళా కమిషన్

**ములుగు జిల్లాలో పర్యటించిన జాతీయ మహిళా కమిషన్ బృందం**

**కలెక్టర్, ఎస్పీతో సమావేశమై వివరాలు సేకరించిన కమిటీ**

ములుగు, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): ఇటీవల ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదని జాతీయ మహిళా కమిషన్ ప్రాథమిక విచారణలో తేలింది. మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఏర్పాటు చేసిన విచారణ కమిటీ, గురువారం తెలంగాణలోని ములుగు జిల్లాలో పర్యటించింది. ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలు డెలినా ఖోంగ్‌దుప్ నేతృత్వంలోని ఈ బృందం, ములుగు కలెక్టరేట్‌లో కలెక్టర్ టి.ఎస్. దివాకర, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌లతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకుంది. అనంతరం, అత్యాచారం జరిగినట్లుగా ప్రచారమైన మేడారం జాతర పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ప్రాథమిక విచారణలో భాగంగా, జాతరలో అలాంటి దురదృష్టకర సంఘటన ఏదీ జరగలేదని నిర్ధారణకు వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. జాతర సమయంలో 13 ఏళ్ల బాలికపై ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారంటూ వార్తలు రావడంతో జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. దీనిపై విచారణ జరిపేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. పోలీసుల నుంచి పూర్తిస్థాయి లిఖితపూర్వక నివేదిక అందిన తర్వాత, ఈ కమిటీ తన తుది నివేదికను జాతీయ మహిళా కమిషన్‌కు సమర్పించనుంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర జనవరి 28 నుంచి 31 వరకు జరిగింది. ఈ జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు.

## రెండేళ్లలో కేసీఆర్ సీఎం

**అభివృద్ధి పనులు చేసుకుందాం.. మాజీమంత్రి హరీశ్ రావు**

గజ్వేల్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో రెండేళ్లలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏమీ చేయరని విమర్శించారు. గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు మాట్లాడుతూ, మనల్ని బాగా చూసుకునే వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు పందులతో ఉన్న గజ్వేల్ ఆసుపత్రి కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది కానీ వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు కానీ బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందని అన్నారు. అప్పుడు బంగారం ఆశపెట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడటం లేదని విమర్శించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై తిట్ల వర్షం కురిపించడం తప్ప రేవంత్ రెడ్డికి తెలిసిందేమీ లేదని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత రైతు బంధు ఇస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ ఈ నెల 11 లోపు ఇవ్వకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే అభివృద్ధి విషయంలో కేసీఆర్‌తో పోటీ పడాలని సవాల్ చేశారు.

## హనుమకొండలో మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

**తొలి రోజు లెక్కింపులో ఆదాయం రూ.2 కోట్లపైనే**

హనుమకొండ, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): మేడారం జాతరకు సంబంధించి హుండీల లెక్కింపు ప్రారంభమైంది. హుండీల లెక్కింపునకు పది రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు. రెండేళ్లకోసారి వచ్చే ఈ మహా జాతర గత నెల 28 నుంచి 31 వరకు జరిగింది. సమ్మక్క, సారలమ్మలను కోట్లాది మంది భక్తులు దర్శించుకుంటారు. జాతరకు నెల రోజుల ముందు, జాతర అనంతరం మరికొన్నిరోజులు మేడారంను భక్తులు సందర్శిస్తారు. ఈ మహా జాతర హుండీలను హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. ఈరోజు మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి లెక్కింపును ప్రారంభించారు. మేడారం జాతరకు తరలి వచ్చిన భక్తులు అమ్మవార్లకు కానుకలు సమర్పించుకున్నారు. క్రితంసారి మేడారం జాతరకు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది.

# కేసీఆర్ జాతిపిత.. రేవంత్ బూతుపిత

## నిరాశ నిస్పృహలో సీఎం.. నీతి లేకుండా జాతి వ్యాఖ్యలు.. మేధావులారా స్పందించాలి.. మాజీమంత్రి హరీశ్ పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వికృత మాటలకు సభ్య సమాజం ఛీ కొడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జాతిపిత అన్నందుకు రేవంత్ రెడ్డి విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే ఆవేదన కలుగుతోందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వరుస విమర్శలపై మాజీ మంత్రి హరీశ్ రావు గురువారం కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్‌ను జాతిపితగా తెలంగాణ సమాజం పిలుచుకుంటే రేవంత్ రెడ్డికి ఎందుకు కడుపునొప్పి అని ప్రశ్నించారు. బూతుల ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో మిగిలిపోతాడన్నారు. పాలన చేతకాక సీఎం రేవంత్ రెడ్డి నిరాశ నిస్పృహలో ఉన్నారని చెప్పారు. నీతి లేకుండా జాతి అని మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ వైఖరిని ఎండగట్టారు. సీఎం రేవంత్ రెడ్డి భాష, అరాచకాలపై స్పందించాలంటూ తెలంగాణ మేధావులకు ఈ సందర్భంగా హరీశ్ రావు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి అదుపు తప్పి ఎలా మాట్లాడుతున్నారో గమనించాలంటూ కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు సూచించారు. ఇలాంటి ముఖ్యమంత్రి తెలంగాణకు ఉండటం మన దౌర్భాగ్యమన్నారు. ఏడేళ్లలో ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను 11 కిలో కిలోమీటర్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తవ్వామని.. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద మీటర్లు కూడా తవ్వలేదని విమర్శించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో శవాలు బయటకు తీసుకురాలేని దద్దమ్మ రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడితే అమరవీరుల ఆత్మ ఘోషిస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ఇచ్చారని.. అదే వేదికపై రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారని తెలిపారు. ప్రతిసారీ డైవర్షన్ చేయాలనుకుంటే ప్రజలే రేవంత్‌ని ముఖ్యమంత్రి పదవి నుంచి డైవర్షన్ చేస్తారని చెప్పారు. ప్రతి నెలకో కుంభకోణానికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ నేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు హరీష్ రావు. గ్యారెంటీలు నిల్.. స్కామ్‌లు ఫుల్ అంటూ రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తన కుర్చీని కాపాడుకోవటానికి బీజేపీతో రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ ఎంపీ సీటును బీజేపీకి రేవంత్ రెడ్డి బహుమానంగా ఇచ్చారని చెప్పారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరవలేదన్నారు. పగ ప్రతీకారాలు తప్ప పాలన మీద దృష్టి లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై మండిపడ్డారు. రూ. 25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఎక్కడ ఇచ్చావో ప్రెస్ క్లబ్‌లో చర్చ పెడదామా? అంటూ సీఎం రేవంత్‌కు హరీశ్ రావు సవాల్ విసిరారు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి వచ్చిన తర్వాత అయినా మారాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా హరీశ్ రావు హితవు పలికారు. రేవంత్ రెడ్డి మారతారన్న నమ్మకం తనకు లేదని హరీశ్ రావు స్పష్టం చేశారు.





# జీవన్ రెడ్డి, సంజయ్‌వి స్వార్థ రాజకీయాలు

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ చిత్తవడం ఖాయం.. మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ

జగిత్యాల, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరవేస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. గురువారం జగిత్యాలలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. స్వార్థపూరిత రాజకీయాలతో జగిత్యాల కలుషితం అయిందన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను చిత్తుచిత్తుగా ఓడిస్తామన్నారు. 2029లో అధికారం బీఆర్ఎస్ దేనని, సీఎం రేవంత్ రెడ్డి భాషలాగే, ఆ పార్టీ నాయకుల భాష ఉందని అన్నారు. 2014లో ఓడిపోయినా ఎమ్మెల్యే సంజయ్‌ను కేసీఆర్ ప్రోత్సహించారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ సిద్ధాంతలను సైతం కాంగ్రెస్ పార్టీ విస్మరిస్తోందన్నారు. అభివృద్ధి కోసం పార్టీని వీడానని చెప్తూ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దొంగ మాటలు, కపట నాటకాలు అడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఆ ప్రభుత్వ మోసపూరిత మాటలను ప్రజలు గ్రహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దావ సురేశ్, పట్టణ అధ్యక్షులు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, అయిల్నేని సాగర్ రావు, ఎల్ కార్తికేయ, వొళ్లెం మల్లేశం, వొళ్లాల గంగాధర్, పడిగేల గంగారెడ్డి, దయ్యాల మల్లారెడ్డి, వనమాల నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# 170 మందికి ఉచిత కంటి పరీక్షలు

### జగిత్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహణ



మల్యాల, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): లయన్స్ క్లబ్ ఆఫ్ జగిత్యాల ఆధ్వర్యంలో గురువారం మల్యాలలో జరిగిన ఉచిత కంటి పరీక్ష శిబిరానికి 170 మంది హాజరయ్యారు. అందులో సుమారు 50 మందికి శస్త్ర చికిత్స అవసరం కాగా, వారిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి హాస్పిటల్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ ప్రెసిడెంట్ శ్రీరాముల సుదర్శన్, డీసీఎంసీ తాటిపాముల వినోద్ కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ జగిత్యాల అధ్యక్షుడు వడ్లగట్ట శంకర్, కార్యదర్శి గుండేటి గంగాధర్, కోశాధికారి సామల్ల శ్రీహరి, కమ్మినేని మల్లేశం, అంగడి ఆనందం, చిలుక రాజన్న, దోపాటి దేవదాస్, మల్యాల సర్పంచ్ బొట్ల జయప్రసాద్, మల్యాల పద్మశాలి సంఘం అధ్యక్షుడు బోడ గోవర్ధన్, మల్యాల పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు కుసుమ రాజు హాజరయ్యారు.



# స్వతంత్ర అభ్యర్థికి జీవన్ రెడ్డి ప్రచారం

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఊహించని రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిని పక్కనపెట్టి స్వతంత్ర అభ్యర్థి తరఫున ప్రచారం చేశారు. ఈ చర్య రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి షాక్‌గా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జగిత్యాల రాజకీయాల్లో ఈ ప్రచారం కీలక మలుపుగా మారుతుందా అనే ఆసక్తి నెలకొంది.



# తిరుమల లడ్డూపై దుష్ప్రచారం

### ఏ ప్రమాణానికైనా సిద్ధం: వైవీ సుబ్బారెడ్డి

న్యూఢిల్లీ: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలను వైసీపీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, సీబీఐ నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని వారు తెలిపారు. ఉండవల్లిలో కూటమి నేతలు చేసిన విమర్శలకు కౌంటర్‌గా గురువారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రయోజనాల కోసం భక్తుల మనోభావా లను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారంటూ వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, అందులో నిజం లేదని తేల్చిందని వైసీపీ నేతలు గుర్తుచేశారు. ఆ తర్వాత సీబీఐ కూడా అదే నిర్ధారణకు వచ్చిందని పేర్కొన్నారు. అయినా, కూటమి ప్రభుత్వం కావాలనే విషప్రచారం చేస్తూ, ఫ్లెక్సీలు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వారు ఆరోపించారు. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తనపై చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని, ఎలాంటి పరీక్షకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. "నేను టీటీడీ ఛైర్మన్‌గా ఎలాంటి అవినీతికి పాల్పడ లేదు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే పనులు చేయలేదు. స్వామివారి సాక్షిగా ఏ ప్రమాణం చేయడానికైనా నేను రెడీ. అవసరమైతే దేవుడి ముందు సత్యశోధన (పాలిగ్రాఫ్) పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నాను" అని ఆయన స్పష్టం చేశారు. నెయ్యి సరఫరాను పెంచేందుకే నిబంధనలు సవరించామని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని వివరించారు.

# వైసీపీది మహాపాపం

## ఏక సభ్య కమిషన్ వేస్తున్నాం.. ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది క్షమించరాని మహా పాపం అని ఆయన అభివర్ణించారు. దేవుడితో చెలగాటమాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను, అపవిత్ర ఘటనలను గుర్తుచేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల కీలక సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. కరడుగట్టిన నేరస్థులు అసత్యాన్ని ఎలా నమ్మిస్తారో, అలాగే గత పాలకులు ఇప్పుడు మాట్లాడుతున్నారని చంద్రబాబు అన్నారు. "సీబీఐ నివేదికలో కల్తీ లేదని ఎక్కడా చెప్పలేదు. అయినా, కల్తీ జరగలేదని ఎదురుదాడి చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. రాష్ట్రంలోని భక్తులందరికీ ఒక సామాన్య భక్తుడిగా విజ్ఞప్తి చేస్తున్నా. దేవునికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాలి. ఈ దోషులను కఠినంగా శిక్షిస్తాం. ఏకసభ్య కమిషన్ వేసి సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇప్పటివరకు ఉన్న నివేదికలన్నీ ఆ కమిషన్ ముందు ఉంచుతాం. అవసరమైతే కోర్టులోనూ అదనపు సమాచారం సమర్పిస్తాం. ఇది దేవుడిచ్చిన బాధ్యత, దైవ కార్యం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వైసీపీ నేతలకు దేవుడిపై విశ్వాసం లేకపోవచ్చని, కానీ విశ్వాసం ఉన్న కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే హక్కు వారికి లేదని చంద్రబాబు హెచ్చరించారు. "అంతర్వేదిలో రథం తగలబడితే కందిరీగలు కొరికాయని, ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు. విశ్వాసం లేకపోతే దేవుడి జోలికి రావొద్దు. దేవుడి పవిత్రతను దెబ్బతీయడం దుర్మార్గం. చరిత్రలో ఇప్పటివరకు శ్రీ వెంకటేశ్వర స్వామి జోలికి ఎవరూ రాలేదు. బ్రిటిష్ వాళ్లు కూడా స్వామి వారి సంప్రదాయాలను గౌరవించి, మరింత అభివృద్ధి చేశారు. అలాంటిది మీరు చేసిన ఈ పని దుర్మార్గమైన అపచారం" అని ఆయన తీవ్రంగా ఖండించారు.

# మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు

### ప్రారంభించి, నడిపిన బాలకృష్ణ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): బసవతారకం ఇండో – అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ ఆస్పత్రిలో బ్రాకీథెరపీ యూనిట్, రెండు ఆపరేషన్ థియేటర్లు, మోల్డ్ రూమ్స్, అదనపు క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాన్ని ప్రారంభించారు. మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సును బాలకృష్ణ స్వయంగా నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 2007లో దేశంలోనే తొలిసారిగా క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ వాహనాన్ని అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చేతుల మీదుగా ఆవిష్కరించారని తెలిపారు. ఇప్పటి వరకు 3 లక్షలకు పైగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించామని.. ఈ ఏడాది మాత్రమే ఇప్పటికే 56 వేలకుపైగా పరీక్షలు చేసినట్లు బాలకృష్ణ వెల్లడించారు. మామోగ్రఫీతో పాటు అన్ని రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను మొబైల్ వాహనంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. స్క్రీనింగ్ తర్వాత అవసరమైన వారికి ఆస్పత్రికి తీసుకొని వచ్చి చికిత్స అందిస్తున్నామని వివరించారు. నాన్న నందమూరి తారక రామారావు ఆదేశాల మేరకు ఆస్పత్రిలో అన్ని రకాల సేవలు అందిస్తూ రోగులకు ఓదార్పునిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిలో అందరికీ సమానంగా వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. రోగుల కోసం ఆధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. క్యాన్సర్ గురించి సులభంగా అర్థమయ్యేలా ఒక పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. మొబైల్ వాహనంలో క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాన్ని స్కాన్ చేస్తే క్యాన్సర్ గురించి పూర్తి అవగాహన కల్గించే సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. సీఎంఐ ప్రోగ్రాం ద్వారా రోగులకు ఎన్నో ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. ఆస్పత్రికి వీల్‌చైర్లను వితరణగా అందజేసినందుకు సాంబశివరావుకు ఈ సందర్భంగా బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# ఏపీ హైకోర్టులో అంబటి క్వాష్ పిటిషన్..

అమరావతి, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టయిన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలని (క్వాష్) కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం న్యాయస్థానం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అంబటి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆయనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, రిమాండ్ విధించడం చట్టవిరుద్ధమని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం, ఈ పిటిషన్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. అనంతరం, తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు, అంబటి కస్టడీ, బెయిల్, జైలులో సౌకర్యాలకు సంబంధించిన పిటిషన్‌పై గుంటూరు కోర్టులో కూడా విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం రేపటికి వాయిదా వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబును దూషిస్తూ బూతులతో విరుచుకుపడ్డారనే ఆరోపణలతో అంబటి రాంబాబుపై పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# తొలిసారిగా బెర్త్‌కు చేరిన 'విశ్వతేజ' డ్రెడ్జర్

### మూలపేట పోర్టులో చరిత్రాత్మక ఘట్టం

### శ్రీకాకుళం జిల్లా తలరాత మార్చనున్న మూలపేట పోర్టు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): శ్రీకాకుళం జిల్లా రూపురేఖలను మార్చబోయే మూలపేట పోర్టు నిర్మాణంలో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ప్రాజెక్టును నిర్మిస్తున్న కాంట్రాక్టు సంస్థ విశ్వసముద్ర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన 'విశ్వతేజ' అనే డ్రెడ్జర్ తొలిసారిగా పోర్టు బెర్త్‌కు చేరుకుంది. ఈ పరిణామం, జిల్లా అభివృద్ధిలో ఒక కీలక మలుపుగా నిలవనుందని నిపుణులు అభివర్ణిస్తున్నారు. పోర్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకుని, ఇక కార్యాచరణకు సిద్ధమవుతోందనడానికి ఈ సంఘటన ఒక బలమైన సంకేతంగా నిలుస్తోంది. ఈ డ్రెడ్జర్ రాకతో పోర్టు కార్యకలాపాలకు మార్గం సుగమమైంది. శ్రీకాకుళం జిల్లా చరిత్రలో ఇది ఒక మేలి మలుపు అని, వెనుకబడిన ప్రాంత ముద్రను చెరిపేసి ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తుందని భావిస్తున్నారు. ఈ పోర్టు నిర్మాణం కేవలం ఒక వాణిజ్య కేంద్రంగానే కాకుండా, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది. ఈ ప్రాజెక్టు శ్రీకాకుళం జిల్లా ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపనుంది. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు భారీ పెట్టుబడులతో పోర్టు సమీపంలో పరిశ్రమలు స్థాపించడానికి ఆసక్తి చూపుతున్నాయి. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 35,000 నుంచి 50,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వంటి భూపరివేష్టిత (సముద్ర తీరం లేని) రాష్ట్రాలకు ఈ పోర్టు ఒక కీలక ఎగుమతి, దిగుమతి కేంద్రంగా మారనుంది. బొగ్గు, ఎరువులు, ఇనుప ఖనిజం వంటి భారీ సరకు రవాణాకు ఇది గేట్‌వేగా ఉపయోగపడనుంది. దాదాపు రూ.4,362 కోట్ల అంచనా వ్యయంతో పోర్టు నిర్మాణం జరుపుకుంటోంది. తొలి దశలో భాగంగా 23.50 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో నాలుగు బెర్తుల నిర్మాణం చేపట్టారు. 52 అడుగుల డ్రాఫ్ట్ డెప్త్‌తో 1,20,000 డీడబ్ల్యూటీ సామర్థ్యం ఉన్న భారీ నౌకలు సైతం ఇక్కడ లంగరు వేసేలా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ పోర్టును భోగాపురం విమానాశ్రయంతో అనుసంధానిస్తూ 200 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ తీరప్రాంత జాతీయ రహదారిని కూడా అభివృద్ధి చేస్తున్నారు. తుపానులు, భారీ వర్షాల కారణంగా మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని, అందుకే గడువు పొడిగించాలని నిర్మాణ సంస్థ విశ్వసముద్ర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ గతంలో ప్రభుత్వాన్ని కోరింది.

# జగన్‌కు పోలీసుల నోటీసులు!

### నేడు జోగి రమేశ్ ఇంటికి మాజీ సీఎం

### రూట్ మార్చాలంటూ ఖాకీల నోటీసులు జారీ

విజయవాడ, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ విజయవాడ పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించారు. రేపు మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ సిద్ధమవుతున్న తరుణంలో, పర్యటన మార్గాన్ని మార్చాలని విజయవాడ పోలీసులు నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే, జగన్ శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ నివాసానికి వెళ్లాల్సి ఉంది. ఇందుకోసం తాడేపల్లి నుంచి కనకదుర్గ వారధి, ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే, పర్యటనకు ఒక రోజు ముందు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ స్వయంగా ఈ మార్గంలో వెళ్లవద్దని, వేరే దారిలో వెళ్లాలని సూచిస్తూ నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇటీవల గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబును పరామర్శించేందుకు జగన్ వెళ్లినప్పుడు భారీగా జనం తరలివచ్చారని, ఈ ప్రజా స్పందన చూసి కూటమి ప్రభుత్వం భయపడిందని వైసీపీ నేతలు అంటున్నారు. అందుకే ఇప్పుడు విజయవాడ పర్యటనను అడ్డుకునేందుకు కుట్రపూరితంగా ఆంక్షలు విధిస్తోందని వైఎస్సార్సీపీ వర్గాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ముందస్తుగా సమాచారం ఇచ్చినా చివరి నిమిషంలో పోలీసులు మార్గాన్ని మార్చమంటున్నారని పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పీఆర్ రిటైర్డ్ ఎస్ఈ నివాసంలో ఏసీబీ సోదాలు

వైజాగ్, ఫిబ్రవరి 5 (ఈవార్తలు): విశాఖలో ఇటీవలే పదవీ విరమణ చేసిన పంచాయతీరాజ్ ఎస్ఈ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. రిటైర్డ్ ఎస్ఈ శ్రీనివాసరావు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. విశాఖ మధురవాడలో ఉన్న నివాసంతో పాటు సమీప బంధువుల ఇళ్లలో కూడా సోదాలు జరుగుతున్నాయి. సాలూరులో శ్రీనివాసరావు బంధువు నారాయణరావుతో పాటు హైదరాబాద్ లోని ఇతర బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

# ఏపీ పోలీసింగ్‌లో ఏఐ

### ఏఐ 4ఏపీ పోలీస్' ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన డీజీపీ

విజయవాడ,ఫిబ్రవరి 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో సరికొత్త శకానికి నాంది పలుకుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతికతను మరో మెట్టు ఎక్కించారు. నేర విచారణను వేగవంతం చేయడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడం, పౌర సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత 'ఏఐ4ఏపీ పోలీస్' పైలట్ ప్రాజెక్టును బుధవారం ప్రారంభించారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించారు. తొలి దశలో భాగంగా చిత్తూరు, గుంటూరు, అన్నమయ్య జిల్లాల్లో దీనిని అమలు చేయనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, సంప్రదాయ పోలీసింగ్ విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అధునాతన ఏఐ టెక్నాలజీతో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి, డిజిటల్ పోలీసింగ్‌లో కొత్త ప్రమాణాలను నెలకొల్పనున్నట్లు వివరించారు. 'ఏఐ4ఏపీ పోలీస్' అనేది ఒక సమగ్రమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిష్కారమని, దీని ద్వారా విచారణ సమయం తగ్గడమే కాకుండా, దర్యాప్తు నాణ్యత పెరిగి శిక్షల రేటు మెరుగుపడుతుందని, పౌరుల సంతృప్తి స్థాయి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఏడాది జూన్ 2025లో జాతీయ స్థాయిలో నిర్వహించిన 'ఏఐ4 ఆంధ్ర పోలీస్ హ్యాకథాన్' ఈ ప్రాజెక్టుకు పునాది వేసింది. దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ఆవిష్కర్తలు, టెక్ నిపుణులు పాల్గొన్న ఈ హ్యాకథాన్‌లో వచ్చిన ఆలోచనల ఆధారంగానే ఈ ఏఐ టూల్స్‌ను అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్ట్ అభివృద్ధి, నాలెడ్జ్ బదిలీ కోసం అమెరికాకు చెందిన జెనరేటివ్ ఏఐ సంస్థ '4సైట్ఏఐ' సీఈఓ సూర్య కొత్త ను నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా నియమించారు. టెక్నాలజీ భాగస్వామిగా 'స్పారిటీ' సంస్థతో పోలీసు శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. హ్యాకథాన్‌లో గెలుపొందిన బృందాల సహకారంతో కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే ఈ ఏఐ టూల్స్‌ను వినియోగానికి సిద్ధం చేయడం విశేషం.



## యూట్యూబ్‌లో ఆటో డబ్బింగ్ ఫీచర్

**27 భాషల్లో వీడియోలను ఆటోమేటిక్‌గా డబ్ చేసే సౌకర్యం**

**సహజమైన వాయిస్ కోసం 'ఎక్స్‌ప్రెసివ్ స్పీచ్' అనే కొత్త అప్‌డేట్**




న్యూయార్క్: ప్రముఖ వీడియో ప్లాట్‌ఫామ్ యూట్యూబ్, తన ఏఐ ఆధారిత ఆటో-డబ్బింగ్ ఫీచర్‌ను యూజర్లందరికీ అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పరిమితంగా ఉన్న ఈ సౌకర్యం, ఇప్పుడు అన్ని ఛానెళ్లకు విస్తరించింది. దీని ద్వారా వీడియోలను 27 భాషల్లోకి ఆటోమేటిక్‌గా డబ్ చేసి చూడవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంటెంట్‌ను భాషా అడ్డంకులు లేకుండా వీక్షించడానికి ఇది వీలు కల్పిస్తుంది. 2023లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ ఫీచర్‌ను, 2024లో నాలెడ్జ్, ఇన్ఫర్మేషన్ వీడియోలకు విస్తరించారు. ఇప్పుడు మ్యూజిక్ వీడియోలు మినహా దాదాపు అన్ని రకాల వీడియోలకు ఈ ఆటో-డబ్బింగ్ సదుపాయం వర్తిస్తుంది. ఈ ఫీచర్‌కు మంచి ఆదరణ లభిస్తోందని, డిసెంబర్ 2025లో రోజుకు సగటున 60 లక్షల మందికి పైగా వీక్షకులు కనీసం 10 నిమిషాల పాటు ఆటో-డబ్డ్ కంటెంట్‌ను చూశారని యూట్యూబ్ వెల్లడించింది. ఈ అప్‌డేట్‌లో భాగంగా 'ఎక్స్‌ప్రెసివ్ స్పీచ్' అనే కీలక ఫీచర్‌ను ప్రవేశపెట్టారు. ఇది డబ్ చేసిన వాయిస్‌ను మరింత సహజంగా, ఒరిజినల్ స్పీకర్ హావభావాలకు, టోన్‌కు దగ్గరగా ఉండేలా చేస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ హిందీ, ఇంగ్లీష్, స్పానిష్‌తో సహా ఎనిమిది భాషల్లో అందుబాటులో ఉంది. దీనితో పాటు, డబ్బింగ్‌కు అనుగుణంగా స్పీకర్ పెదవుల కదలికలను సరిపోల్చే 'లిప్ సింక్' ఫీచర్‌పై కూడా యూట్యూబ్ ప్రయోగాలు చేస్తోంది. వీక్షకులు తమకు నచ్చిన భాషను ఎంచుకోవడానికి 'ప్రిఫర్డ్ లాంగ్వేజ్' సెట్టింగ్‌ను కూడా యూట్యూబ్ జోడించింది. క్రియేటర్లు తమకు ఇష్టం లేకపోతే ఈ ఆటో-డబ్బింగ్ ఫీచర్‌ను ఆఫ్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. ఈ ఫీచర్ వల్ల క్రియేటర్లు తమ కంటెంట్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు సులభంగా చేరువ చేయడానికి గొప్ప అవకాశం లభించినట్లయింది.

## కొరియన్ కలవరింతలు!



**ఘజియాబాద్ అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసులో విస్తుగొలిపే విషయాలు**

**సోషల్ మీడియా ఖాతాలను కొరియన్ పేర్లతో తెరిచిన అక్కాచెల్లెళ్లు**

**ఇంట్లో కూడా అవేపేర్లతో పిలుచుకునే వారని గుర్తించిన పోలీసులు**


లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసు విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగు చూస్తున్నాయి. కొరియన్ ఆన్‌లైన్ గేమ్‌కు బానిసైన నిషిక (16), ప్రాచి (14), పఖీ (12) బుధవారం ఉదయం బలవన్మరణానికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో ఎన్నో విషయాలు వెల్లడయ్యాయి. ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లకు కొరియన్ అంటే చాలా ఇష్టమని, సోషల్ మీడియాలో తమ ఖాతాలను కూడా కొరియన్ పేర్లతో తెరిచినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మహత్యకు పది రోజుల ముందు వారి సోషల్ మీడియా ఖాతాలను తండ్రి డిలీట్ చేశారు. వీరు ముగ్గురు మరియా, అలీజా, సిండీ అనే కొరియన్ పేర్లతో ఖాతాలను తెరిచారు. ఇంట్లో కూడా వారు అవే పేర్లతో పిలుచుకునేవారు. ఇటీవల తండ్రి ఆ ఖాతాలను డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి తండ్రి మొబైల్ ఫోన్లు కూడా తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. సోషల్ మీడియా ఖాతాలను డిలీట్ చేయడం, తమ వద్ద ఫోన్లు లేకుండా చేయడంతో వారు ముగ్గురు తీవ్ర మనస్తాపానికి లోనయ్యారని పోలీసులు తెలిపారు. తమకు కొరియన్ అంటే ప్రాణమని, ఈ విషయం మీకు అర్థం కాదని, ఇక్కడి వాళ్లను మేం పెళ్లి చేసుకోలేమని డైరీలో ముగ్గురు అమ్మాయిలు రాసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

## చెన్నైలో 1,500 కాకులు మృతి

**బర్డ్ ఫ్లూ కలకలం.. కాకుల్లో ఏవియన్ ఇన్ ఫ్లుయెంజా**

**తమిళనాడు ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసిన కేంద్ర ప్రభుత్వం**

**చనిపోయిన పక్షులను తాకవద్దంటూ అధికారుల హెచ్చరిక**



చెన్నై: చెన్నైలో 1,500కు పైగా కాకులు మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇది బర్డ్ ఫ్లూ (ఏవియన్ ఇన్ ఫ్లుయెంజా) కారణంగానే అని నిర్ధారణ కావడంతో నగరాన్ని హై అలర్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రంగంలోకి దిగి, వ్యాధి నివారణ చర్యలను ముమ్మరం చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇటీవలి రోజుల్లో నగరంలోని అడయార్, గాంధీ నగర్, పల్లికరనై, వేలచ్చేరి, ఈస్ట్ కోస్ట్ రోడ్, ఓల్డ్ మహాబలిపురం రోడ్ వంటి పలు ప్రాంతాల్లో కాకులు పెద్ద సంఖ్యలో చనిపోయి కనిపించాయి. సమాచారం అందుకున్న కాంచీపురం యానిమల్ డిసీజ్ ఇన్వెస్టిగేషన్ బృందం గత నెలలో మరణించిన కాకుల నుంచి శాంపిళ్లను సేకరించి భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ డిసీజ్ కంట్రోల్‌కు పంపింది. పరీక్షల అనంతరం కాకుల మృతికి బర్డ్ ఫ్లూనే కారణమని నివేదికలు స్పష్టం చేశాయి. ఈ వైరస్ ఇతర జంతువులకు, అరుదుగా మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉండటంతో కేంద్ర పశువైద్య పరిశోధన సంస్థ తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. నిఘాను పెంచాలని, ప్రభావిత ప్రాంతాల్లో పక్షుల కదలికలపై ఆంక్షలు విధించాలని సూచించింది. పశుసంవర్ధక శాఖ కూడా ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. ఎక్కడైనా పక్షులు చనిపోయి కనిపిస్తే వెంటనే అధికారులకు తెలపాలని కోరింది. చనిపోయిన పక్షులను నేరుగా చేతులతో తాకవద్దని, వాటి కళేబరాలను కనీసం 8 అడుగుల లోతైన గొయ్యి తీసి పూడ్చివేయాలని హెచ్చరించింది. ప్రజలు భయాందోళనలకు గురికావద్దని, భద్రతా మార్గదర్శకాలను పాటిస్తే సరిపోతుందని అధికారులు భరోసా ఇస్తున్నారు. చెన్నైలోని పౌల్ట్రీ ఫారాలు, పక్షులు నివసించే ప్రాంతాల్లో నిఘా పెంచారు. ఇదిలా ఉండగా, కేరళ, బీహార్ రాష్ట్రాల్లోనూ బర్డ్ ఫ్లూ కేసులు నమోదైనట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

# సరైన దిశలో దేశం దశ

**రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం**

**ప్రధాని మాట్లాడుతుండగా విపక్షాలు వాకౌట్**

**మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకంపై చర్చకు పట్టు**

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇస్తుండగా, విపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అడ్డంకి కలిగించి, చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సభ నుంచి వాకౌట్ చేశారు. మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవణే తన ఆత్మకథలో రాసిన కొన్ని కీలక అంశాలపై లోక్‌సభలో చర్చకు అనుమతించకపోవడమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 2020లో చైనాతో సరిహద్దు ఘర్షణల సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందలేదని నరవణే పేర్కొన్నారని, ఆ భాగాలను చదివి వినిపించేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే అంశంపై గత మూడు రోజులుగా లోక్‌సభ దద్దరిల్లుతోంది. బుధవారం లోక్‌సభలో మహిళా ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలపడంతో సభ వాయిదా పడి, ప్రధాని ప్రసంగం నిలిచిపోయింది. ఇవాళ రాజ్యసభలోనూ విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యసభలో విపక్షాల నినాదాలు, అల్లరి మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'వికసిత భారత్' నిర్మాణంలో దేశం సరైన దిశలో వేగంగా పయనిస్తోందని అన్నారు. "గత కొన్ని సంవత్సరాలు దేశ వేగవంతమైన అభివృద్ధికి సాక్ష్యంగా నిలిచాయి. ప్రతి రంగంలోనూ ఇది మార్పుల యుగం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్యంలోకి వెళుతుంటే, యువశక్తితో ఉరకలేస్తున్న భారత్ ప్రపంచానికి కొత్త ఆశను అందిస్తోందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు



11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ పెరిగిందని, ఇటీవలే 9 కీలక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. గత కొన్నేళ్లుగా చేపట్టిన సంస్కరణల కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్‌తో వ్యాపారం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు విపక్ష సభ్యులు 'విపక్ష నేతను మాట్లాడనివ్వండి', 'నియంతృత్వం నశించాలి' వంటి నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సరదాగా వ్యాఖ్యలు చేశారు. "ఖర్గే జీ వయసు, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని ఆయన కూర్చునే నినాదాలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి" అని ప్యానెల్ స్పీకర్ ను కోరుతున్నట్లు చమత్కరించారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి నిష్క్రమించాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రభుత్వం కాలరాస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా, అభివృద్ధి అజెండానే తమకు ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

## సిక్కులపై రాహుల్‌కు ద్వేషం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: సిక్కుల పట్ల కాంగ్రెస్ అగ్రనేతకు (రాహుల్ గాంధీకి) ఎంత ద్వేషం ఉందో ఆయన మాటల్లోనే కనిపించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని ఎంతోమంది వీడారని, కానీ ఆ పార్టీ ముఖ్య నేత మాత్రం రవ్‌నీత్ బిట్టును పార్లమెంట్ ఆవరణలో అవమానించారని మండిపడ్డారు. సిక్కుల పట్ల ఆయనకు ఉన్న ద్వేషం ఈ మాటల్లో కనిపించిందని వ్యాఖ్యానించారు. ఇదేనా మీరు తెరిచిన మొహబ్బత్ కీ దుకాణం అని ప్రశ్నించారు. ఇదే చోట ఓ ఎంపీని కాంగ్రెస్ అగ్రనేత ద్రోహి అనడం దారుణమని అన్నారు. అతనికి గర్వం తలకెక్కిందని అన్నారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదని విమర్శించారు. కాగా, నిన్న బిట్టూ, రాహుల్ గాంధీ మధ్య మాటల యుద్ధం సాగిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీ ఇంకా మాట్లాడుతూ, గరీబీ హటావో కాంగ్రెస్ పార్టీకి ఒక నినాదం మాత్రమే అని అన్నారు. ప్రతి విషయంలో విపక్షాలు తనను నిందిస్తున్నాయని మండిపడ్డారు. నక్సలిజాన్ని అంతం చేసినందుకు తనను నిందిస్తున్నారా అని ప్రశ్నించారు. మా ప్రభుత్వంపై పేదలకు నమ్మకం పెరిగిందని అన్నారు.

## వరుస లాభాలకు బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో మూడు రోజులుగా కొనసాగుతున్న లాభాల జోరుకు గురువారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల సరళిపై స్పష్టత కోసం మదుపరులు వేచి చూసే ధోరణి అవలంబించడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 503 పాయింట్లు నష్టపోయి 83,313 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 113 పాయింట్లు తగ్గి 25,642 వద్ద క్లోజ్ అయింది. బ్రాడర్ మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.28 శాతం నష్టపోగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.29 శాతం మేర పతనమైంది. రంగాల వారీగా చూస్తే, పీఎస్‌యూ బ్యాంకింగ్ సూచీ 0.38 శాతం లాభపడటం మినహా మిగిలినవన్నీ నష్టాల బాట పట్టాయి. మెటల్ రంగం అత్యధికంగా 1.02 శాతం పతనం కాగా, ఐటీ, ఆటో రంగాలు అర శాతానికి పైగా నష్టపోయాయి. ఇటీవల బాగా పెరిగిన షేర్లలో కొందరు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారని విశ్లేషకులు తెలిపారు. అమెరికా-ఇరాన్ చర్చల పురోగతిపై స్పష్టత కోసం కూడా మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి.

## బెంగాల్ సరిహద్దులో కంచెకు భూమిస్తాం

**అసెంబ్లీలో మమతా బెనర్జీ కీలక ప్రకటన**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో బంగ్లాదేశ్‌తో సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం కోసం కేంద్రానికి భూమి ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. అయితే అంతకంటే ముందు బీఎస్ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్లకు పెంచుతూ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సరిహద్దులో కంచె ఏర్పాటును అడ్డుకుంటోందని కేంద్రం, బీజేపీ నేతలు చేసిన ఆరోపణలను ఆమె కొట్టిపారేశారు. బీఎస్ఎఫ్‌తో సహా అన్ని కేంద్ర సంస్థలు, ఏజెన్సీలకు ఇప్పటికే భూమిని అందించామని తెలిపారు. దేశ భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మమతా బెనర్జీ అన్నారు. కంచె విషయంలో భూమి అనేది సమస్య కానే కాదని అన్నారు. ఎంత భూమి అవసరమైతే అంత కేటాయిస్తామని, కానీ బీఎస్ఎఫ్ అధికార పరిధిపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. కంచె విషయంలో కొన్ని వాస్తవాలనే బీజేపీ ప్రజల ముందు ఉంచుతోందని ఆరోపించారు.



## మేఘాలయాలో దారుణం

**బొగ్గు గనిలో పేలుడు..16 మంది మృత్యువాత**

షిల్లాంగ్: మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్ఖె ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, 16 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## 25,000 మంది ఫ్రెషర్ల నియామకం

**ప్లాన్ చేస్తున్న కాగ్నిజెంట్**

న్యూఢిల్లీ: ఐటీ రంగంలో ఉద్యోగాల కోతపై ఆందోళనలు నెలకొన్న తరుణంలో ప్రముఖ దిగ్గజం కాగ్నిజెంట్ నిరుద్యోగులకు తీపి కబురు అందించింది. 2026 ఏడాదిలో సుమారు 24,000 నుంచి 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇది గత ఏడాదితో (20,000 నియామకాలు) పోలిస్తే 20 శాతం అధికం కావడం విశేషం. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను మరింత వేగవంతం చేస్తూ, కంపెనీ తన టాలెంట్ పిరమిడ్‌ను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించింది. సాధారణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలు పోతాయనే వాదనలు వినిపిస్తుంటాయి. అయితే, కాగ్నిజెంట్ దీనిని మరో కోణంలో చూస్తోంది. జెమిని, ఓపెన్ ఏఐ వంటి ప్లాట్‌ఫారమ్‌లతో జతకట్టి ఏఐ టూల్స్ ద్వారా ఎంట్రీ లెవల్ ఉద్యోగుల ఉత్పాదకతను పెంచుతున్నామని సీఈఓ రవి కుమార్ వెల్లడించారు. ఏఐ సహాయంతో కొత్త ఇంజనీర్లు గతంలో కంటే వేగంగా క్లయింట్ ప్రాజెక్టుల్లో భాగస్వాములు అవుతున్నారని, అందుకే ఫ్రెషర్ల నియామకాన్ని పెంచుతున్నామని కంపెనీ స్పష్టం చేసింది. ఆర్థిక ఫలితాల పరంగానూ కాగ్నిజెంట్ అదరగొట్టింది. 2025 డిసెంబరుతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 18.7 శాతం వృద్ధి చెంది 64.8 కోట్ల డాలర్లకు చేరింది. సెప్టెంబర్ నాటితో పోలిస్తే డిసెంబర్ నాటికి ఉద్యోగుల సంఖ్య 1,800 పెరిగి మొత్తం 3.51 లక్షలకు చేరుకుంది.

# పాక్‌లో అంతర్గత తిరుగుబాటు

**అమెరికా మార్కెట్‌లో పాక్ ఎగుమతులపై 19 శాతం సుంకం.. ట్రంప్‌ను నోబెల్ బహుమతికి నామినేట్ చేసినా ఫలితం శూన్యం**

ఇస్లామాబాద్: భారత్, అమెరికా మధ్య ఇటీవల కుదిరిన చారిత్రక వాణిజ్య ఒప్పందం పాకిస్థాన్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడానికి నెలల తరబడి ఇస్లామాబాద్ చేసిన ప్రయత్నాలు విఫలం కావడమే కాకుండా, భారత్ కంటే ఎక్కువ సుంకాల భారం పాకిస్థాన్‌పై పడటంతో అక్కడి విపక్షాలు, విశ్లేషకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ఫిబ్రవరి 2న ప్రకటించిన ఈ ఒప్పందం ప్రకారం అమెరికాకు ఎగుమతి అయ్యే భారతీయ వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గించారు. అయితే, ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేయడం, ఆయనకు భారీ స్థాయిలో 'రెడ్ కార్పెట్' స్వాగతం పలికిన పాకిస్థాన్‌కు మాత్రం 19 శాతం సుంకాన్ని ఖరారు చేశారు. ఈ ఒక్క శాతం వ్యత్యాసం పాకిస్థాన్‌లో ఆత్మగౌరవ పోరాటంగా మారింది. పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ జర్నలిస్టులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా తమ ప్రభుత్వంపై సెటైర్ల వర్షం కురిపిస్తున్నారు. డిజిటల్ క్రియేటర్ వజాహత్ ఖాన్ స్పందిస్తూ.. "ట్రంప్ ఒక వ్యాపారవేత్త. ఆయనకు మోదీలో ఒక భాగస్వామి కనిపిస్తే, పాక్ పాలకులలో కేవలం ఒక మేనేజర్ కనిపించాడు. అందుకే భారత్ 18 శాతం రేటుతో విజేతగా నిలిచింది" అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఉమర్ అలీ అనే యూజర్ చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ పరిస్థితిని ఒక 'నిస్సహాయ ప్రేమికుడి'తో పోలుస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు పాక్ అధికార వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. మాజీ మంత్రి హమ్మద్ అజార్ ఈ పరిణామాలను పాక్ విదేశాంగ విధాన వైఫల్యంగా అభివర్ణించారు. "21వ శతాబ్దపు విదేశాంగ విధానం అంటే ఫొటోలు దిగడం లేదా భజన చేయడం కాదు. అది ఆర్థిక బలం, మార్కెట్ ప్రాప్యతపై ఆధారపడి ఉంటుంది. భారత్ తన ఆర్థిక శక్తితో అమెరికాను ఒప్పించగలిగింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం వల్ల రాబోయే పదేళ్లలో భారత్‌కు సుమారు 150 బిలియన్ డాలర్ల అదనపు ఎగుమతి ఆదాయం సమకూరనుంది. చైనా, వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాల కంటే భారత్ ఇప్పుడు అమెరికా మార్కెట్‌లో తక్కువ సుంకంతో వస్తువులను విక్రయించే అవకాశం పొందింది. మరోవైపు, బలూచిస్థాన్‌లోని ఖనిజ సంపదను అమెరికాకు ఆఫర్ చేసినా దక్కని గౌరవం, భారత్ తన 'స్ట్రాటజిక్ అటానమీ' (వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి) ద్వారా సాధించిందని పాక్ మీడియా విశ్లేషిస్తోంది. ఈ పరిణామం షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ప్రతిష్ఠను దేశీయంగా భారీగా దెబ్బతీసింది.

## అమెరికా గుండెల్లో 'ఇరాన్' రైళ్లు

**భూగర్భంలో భారీ క్షిపణి కేంద్రం సిద్ధం**

వాషింగ్టన్: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ ఇరాన్ తన సైనిక పరాక్రమాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. అమెరికాతో గరిష్ఠ స్థాయి ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఒక అత్యాధునిక 'అండర్ గ్రౌండ్ మిస్సైల్ బేస్'ను ఆవిష్కరించింది. ఇరాన్ సైనిక దళాల అధిపతి అబ్దోల్రహీమ్ మౌసవి బుధవారం ఈ కేంద్రాన్ని సందర్శించి, క్షిపణి యూనిట్ల సన్నద్ధతను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా, ఇరాన్ తన సైనిక సిద్ధాంతాన్ని రక్షణ నుంచి దాడుల శైలికి మార్చినట్లు మౌసవి ప్రకటించడం అంతర్జాతీయంగా సంచలనం రేపుతోంది. గత ఏడాది ఇజ్రాయెల్ తో జరిగిన 12 రోజుల యుద్ధం తర్వాత, కేవలం ఎదురుదాడి చేయడమే కాకుండా.. శత్రువుపై మెరుపు వేగంతో విరుచుకుపడేలా తమ క్షిపణి సామర్థ్యాన్ని పెంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికా గనుక ఏ చిన్న తప్పు చేసినా, ఆ ప్రాంతంలో ఉన్న అమెరికా పౌరులకు కానీ, వారి స్థావరాలకు కానీ రక్షణ ఉండదని ఘాటుగా హెచ్చరించారు. ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తన విమాన వాహక నౌకలను మోహరించడంతో పాటు, ఇరాన్ డ్రోన్లను కూల్చివేస్తూ ఒత్తిడి పెంచుతోంది. మరోవైపు, ఒమన్‌లో ఇరు దేశాల మధ్య రహస్య చర్చలు జరగనున్నాయన్న వార్తల నడుమ.. ఇరాన్ తన భూగర్భ క్షిపణి నగరాన్ని బయటపెట్టడం ద్వారా వాషింగ్టన్‌కు ఒక బలమైన సంకేతం పంపింది.

## వాషింగ్టన్ పోస్ట్‌లో భారీగా లేఆఫ్‌లు

**ఉద్యోగం కోల్పోయిన శశిథరూర్ కుమారుడు**

వాషింగ్టన్: అమెరికన్ మీడియా చరిత్రలో అతి పెద్ద లేఆఫ్ జరిగింది. ప్రఖ్యాత మీడియా సంస్థ వాషింగ్టన్ పోస్ట్ 300 మందికి పైగా జర్నలిస్టులు, సిబ్బందిని లేఆఫ్ చేసింది. ఇది పత్రిక ఎడిటోరియల్ వర్క్‌ఫోర్స్‌లో మూడవ వంతు కంటే ఎక్కువ. ఈ నిర్ణయం యుద్ధ ప్రాంతాలు, గ్లోబల్ రాజధానులు, సున్నితమైన డేట్‌లైన్ల నుంచి రిపోర్ట్ చేస్తున్న కరస్పాండెంట్లలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ కట్స్ ప్రధానంగా విదేశీ బ్యూరోలు, లోకల్ రిపోర్టింగ్ టీమ్స్, స్పోర్ట్స్ డెస్క్, బిజినెస్ డివిజన్‌లో గణనీయ భాగాలను తాకాయి. ఇది కేవలం పత్రికకు మాత్రమే కాకుండా గ్లోబల్ జర్నలిజానికి "డార్క్ డే" అని అందరూ వ్యాఖ్యానిస్తున్నారు. లేఆఫ్ అయిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ కుమారుడు ఇషాన్ థరూర్ (సీనియర్ ఇంటర్నేషనల్ అఫైర్స్ కాలమ్నిస్ట్) కూడా ఉన్నారు. ఇషాన్ థరూర్ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. "నేను ఈ రోజు వాషింగ్టన్ పోస్ట్ నుంచి లేఆఫ్ అయ్యాను. నాతో పాటు అంతర్జాతీయ వ్యవహారాలు చూసే పలువురు ఉద్యోగాలు కోల్పోయారు. 12 ఏళ్లుగా నేను ఈ సంస్థలోనే పని చేస్తున్నాను. ఎంతో మంది అద్భుతమైన వ్యక్తులతో కలిసి పని చేశాను. ఈ పరిణామం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది" అని అన్నారు. న్యూస్ రూమ్ ను, 'డెమోక్రసీ డైస్ ఇన్ డార్క్ నెస్' అనే పోస్టర్ ను షేర్ చేశారు. 'డార్క్ డే' అనే వ్యాఖ్యను జోడించారు. ఈ పోస్ట్ ను శశిథరూర్ కూడా రీషేర్ చేశారు.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
శుక్రవారం 6-2-2026 || www.evarthalu.com || 6



వయ్యారి చిత్రం

## మళ్లీ దర్శకుడిగా పుట్టను: గుణశేఖర్



ప్రముఖ సీనియర్ దర్శకుడు గుణశేఖర్ తన కెరీర్, వ్యక్తిగత అనుభవాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో రూపొందిన సరికొత్త చిత్రం 'యుఫోరియా'. ఈ చిత్రం ఫిబ్రవరి 6వ తేదీన విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆయన ఆసక్తికర మళ్లీ జన్మంటూ ఉంటే దర్శకుడిగా పుట్టను అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దర్శకత్వం వహించడం వల్ల ఎదురయ్యే విపరీతమైన ఒత్తిడిని దృష్టిలో పెట్టుకునే తాను ఆ మాట అన్నానని , చాలామంది భావిస్తున్నట్లు దీనికి సోషల్ మీడియా ట్రోలింగ్ కారణం కాదని గుణశేఖర్ స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక దర్శకుడు భరించే మానసిక భారం మాత్రమేనని ఆయన తెలిపారు. ఏ వృత్తిలోనైనా పని పూర్తయ్యాక ఒక రకమైన సంతృప్తి లభిస్తుందని, కానీ దర్శకుడికి సినిమా విడుదలయ్యే వరకు ఆ ప్రశాంతత దొరకదని ఆవేదన వ్యక్తం చేశారు. 1992లో తన సినీ ప్రస్థానం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు కంటినిండా నిద్రకు దూరమయ్యానని, కనీసం వచ్చే జన్మలోనైనా హాయిగా నిద్రపోవాలన్న ఆశతోనే దర్శకుడిగా పుట్టనని అన్నానని ఆయన నవ్వుతూ వివరణ ఇచ్చారు.



## పెళ్లి కోసం.. రష్మిక బ్రేక్!

టాలీవుడ్ క్రేజీ లవ్ బర్డ్స్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మికమందన్న త్వరలో వివాహం చేసుకోబోతున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో అత్యంత అట్టహాసంగా భారీ డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుందని తెలుస్తోంది. దీనిపై ఇంత వరకు విజయ్ దేవరకోండ, రష్మిక మందన్నల టీమ్ నుంచి క్లారిటీ లేదు. అలా అని దీన్ని వారు ఖండించనూ లేదు. దీంతో విజయ్ దేవరకొండ, రష్మికల వివాహం ఉదయ్‌పూర్‌లోని ప్యాలెస్‌లో అత్యంత భారీ స్థాయిలో జరగనుందనే సంకేతాలు మొదలయ్యాయి. దాన్ని నిజం చేస్తూ రష్మిక మందన్న తన సినిమాల షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చేసిందని తెలుస్తోంది. రష్మిక మందన్న ప్రస్తుతం మైసా, కాక్‌టేయిల్ 2తో పాటు బన్నీ నటిస్తున్న భారీ పాన్ వరల్డ్ మూవీలోనూ నటిస్తోంది. పుష్పతో అదరగొట్టిన ఈ జోడీ మరోసారి అట్లీ మూవీ కోసం జోడీ కడుతున్నారు. ఈ మూవీ తాజా షెడ్యూల్ ఫిబ్రవరి 15 వరకు సాగుతుందట. అయితే ఫిబ్రవరి 26న విజయ్ దేవరకొండతో వివాహం జరగనున్న నేపథ్యంలో రష్మిక బన్నీ, అట్లీల మూవీకి బ్రేక్ ఇవ్వనుందని తెలుస్తోంది.

## 27న శ్రీవిష్ణు 'మృత్యుంజయ' రిలీజ్




విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త థ్రిల్లర్ మూవీ 'మృత్యుంజయ' విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను ఈ ఏడాది ఫిబ్రవరి 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో రెబా జాన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీవిష్ణు తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో రిలీజ్ డేట్ పోస్టర్‌ను పంచుకున్నారు. "ఫిబ్రవరి 27న 'మృత్యుంజయ' థియేటర్లలో మీ హృదయాలను గెలుచుకోవడానికి వస్తోంది. ఈ థ్రిల్లింగ్ కథతో మిమ్మల్ని కలుస్తాను" అని రాసుకొచ్చారు. హీరోయిన్ రెబా జాన్ కూడా పోస్టర్ షేర్ చేస్తూ, "ప్రతి సమాధానం మరో ప్రాణాంతకమైన ప్రశ్నను లేవనెత్తుతుంది. ఫిబ్రవరి 27న 'మృత్యుంజయ' సినిమా హాళ్లలోకి వస్తోంది" అని పేర్కొన్నారు. ఈ సినిమాను సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి నిర్మిస్తుండగా, రమ్య గున్నం సమర్పిస్తున్నారు. కాలభైరవ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## అఖిల్ 'లెనిన్' వాయిదా?



అక్కినేని యంగ్ హీరో అఖిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న లేటెస్ట్ రూరల్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లెనిన్' సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో ఈ చిత్రంపై అంచనాలు పెరిగాయి. మొదటగా ఈ సినిమాను మే 1న వరల్డ్ వైడ్‌గా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో 'లెనిన్' విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయన్న వార్తలు సినీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న అవెయిటెడ్ విలేజ్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' మూవీ రిలీజ్ డేట్ మారడం దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు.

## నా పనైపోయిందనుకున్నా



రియా చక్రవర్తి

బాలీవుడ్ వివాదాస్పద బ్యూటీ రియా చక్రవర్తి మళ్ళీ కెమెరా ముందుకు వస్తోంది. గత ఏడేళ్లుగా సినిమాలకు, నటనకు దూరంగా ఉన్న ఈ భామ.. నెట్‌ఫ్లిక్స్ ప్రతిష్టాత్మక షో 'ఫ్యామిలీ బిజినెస్'తో సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసింది. ఈ సందర్భంగా .. తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన ఎమోషనల్ పోస్ట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. నటిగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ రియా షేర్ చేసిన వీడియోలో చాలా ఎమోషనల్ అయింది. '7 ఏళ్లు.. ఇది నిజంగా నమ్మలేనంత వింతగా ఉంది. నేను మళ్ళీ నటిస్తానని కలలో కూడా అనుకోలేదు. 17 ఏళ్ల వయసులో ఏ కలలతో అయితే ముంబైకి వచ్చానో, మధ్యలో జరిగిన కొన్ని సంఘటనల వల్ల ఆ కలకు బ్రేక్ పడింది. పని దొరకడం ఆగిపోయింది. కల చెదిరిన చోటే ఇప్పుడు మళ్ళీ సెట్స్ లో అడుగుపెట్టడం ఒక కల నిజమైనట్లుగా ఉంది' అని చెప్పింది.

## అలియాభట్ మరో ప్రయోగం

కమర్శియల్ చిత్రాలైనా.. ప్రయోగాత్మక పాత్రలైనా.. గంగూబాయి లాంటి లేడీ డాన్ రోల్ అయినా అవలీలగా పోషించగలనని అలియాభటి ప్రూవ్ చేసుకుంది. గ్లామర్ పాత్రల పరంగా అలియా అభినయం గురించైతే చెప్పాల్సిన పనిలేదు. 'ఆల్ఫా' లాంటి చిత్రానికి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిలింస్ ప్రత్యేకంగా అలియాభట్ నే స్పై పాత్రకు ఎంపిక చేసిదంటే? అలియా ఎంత గొప్ప ఫెర్ఫార్మర్ కాకపోతే చాన్స్ ఇస్తారు. అయితే, ఈ సారి మరో ప్రయోగానికి రెడీ అయింది అలియా. అలియాభట్ ప్రధాన పాత్రలో హౌస్ వైఫ్ అనే ఓ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాడు అభిషేక్ పాఠక్. వివాహమైన ఓ జంట చుట్టూ తిరిగే కథ ఇది. ఈ రిలేషన్ షిప్ డ్రామాలో మరో కీలక పాత్రకు నేచురల్ పెర్ఫార్మర్ రాజ్ కుమార్ రావ్‌ని తీసుకుంటున్నారు. ఆయనకు భార్య పాత్రలోనే అలియాభట్ కనిపించనుంది. అయితే ఈ భార్యాభర్తల్ని అభిషేక్ పాఠక్ చాలా బోల్డ్ గా చూపించబోతున్నాడు అన్నది హైలైట్ అంశం. నాలుగు గోడల మధ్య ఉండే భార్యభర్తల రహస్య బంధాన్ని ఎంతో బోల్డ్ గా చూపించబోతున్నాడట.





అభిరామి

## నిద్రలేని రాత్రులు గడుపుతున్నా

వందలాది అసభ్యకరమైన కామెంట్లు, బాడీ షేమింగ్‌తో తాను తీవ్ర మానసిక వేదన అనుభవించానని, నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చిందని ప్రముఖ మలయాళ గాయని, నటి అభిరామి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఫిబ్రవరి 1న నిర్వహించిన ఓ లైవ్ మ్యూజిక్ షో అనంతరం సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల కారణంగా ఆమెపై నెటిజన్లు దారుణమైన విమర్శలు గుప్పించడంతో ఈ ఘటన చర్చనీయాంశమైంది. ప్రదర్శనలో ఆమె కదలికలు, శరీర భంగిమలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ బాడీ షేమింగ్‌కు దిగడం ఆమెను తీవ్రంగా కలిచివేసింది. ఈ నేపథ్యంలో అభిరామి సోషల్ మీడియాలో ఒక భావోద్వేగపూరిత పోస్ట్ షేర్ చేస్తూ సోషల్ మీడియాను "డస్ట్ బిన్... మాలిన్యపు కుప్ప"గా అభివర్ణించారు. ఎవరిని ఎంత ఎక్కువగా అవమానించగలమో అనే పోటీ నెటిజన్ల మధ్య నడుస్తోందని, తాను ఒక లైవ్ పెర్ఫార్మర్‌నని, స్టేజ్‌పై బొమ్మలా నిలబడి పాడటం తన స్వభావం కాదని, ప్రదర్శన సమయంలో కదలడం, డ్యాన్స్ చేయడం తన కళలో భాగమని వివరించారు. శ్వాసను, శరీరాన్ని సంగీతానికి అంకితం చేస్తానని, అదే తన పెర్ఫార్మెన్స్ స్టైల్ అని ఆమె స్పష్టం చేశారు.



రాషా తడాని

## ప్రభాస్ ప్రశంసలు నాకు గర్వం

దిశ, సినిమా: బాలీవుడ్ స్టార్ నటి రవీనా టాండన్ కూతురు రాషా తడాని కేవలం నటనకే పరిమితం కాకుండా, సింగింగ్‌లోనూ తన సత్తా చాటుతోంది. అభయ్ వర్మతో కలిసి నటిస్తున్న 'లైకీ లైకా' చిత్రంలో ఆమె స్వయంగా ఒక పాట పాడి యూట్యూబ్‌ను షేక్ చేసింది. ఈ పాట విడుదలైన తర్వాత నెటిజన్ల నుంచి మంచి రెస్పాన్స్ రావడమే కాకుండా, టాలీవుడ్ సూపర్ స్టార్ ప్రభాస్ నుంచి ప్రశంసలు దక్కడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాషా తడాని ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'ప్రభాస్ గారు నాకు పెద్ద ఇన్స్పిరేషన్. ఆయన అంత పెద్ద స్టార్ అయి ఉండి, నన్ను ప్రోత్సహించడం చాలా గర్వంగా ఉంది. ఆయన ఇచ్చిన బూస్టింగ్ నా ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది' అంటూ రాషా ఎమోషనల్ అయింది.




# రేపటి నుంచే టీ20 వరల్డ్ కప్

## డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో టీమిండియా.. పాకిస్థాన్ మ్యాచ్‌లు జరిగితే కొలంబోకు వేదికల మార్పు

**క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 ఎల్లుండి ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 7న అట్టహాసంగా మొదలుకానున్న ఈ మెగా టోర్నమెంట్, మార్చి 8న జరిగే ఫైనల్‌తో ముగియనుంది. ఈసారి ప్రపంచకప్ టైటిల్ కోసం మొత్తం 20 జట్లు పోటీ పడుతుండగా, 55 మ్యాచ్‌లు జరగనున్నాయి.**

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమిండియా, మూడోసారి కప్ గెలిచి, టైటిల్‌ను నిలబెట్టుకున్న జట్టుగా రికార్డు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది అభిమానులు ఈ క్రికెట్ సంబరాన్ని వీక్షించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ఈ మెగా టోర్నమెంట్‌లో పాల్గొంటున్న 20 జట్లను ఐదు జట్ల చొప్పున నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-8 దశకు అర్హత సాధిస్తాయి. ఈసారి టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. మొత్తం 8 వేదికలను ఖరారు చేశారు. అయితే, పాకిస్థాన్ మ్యాచ్‌ల విషయంలో ఐసీసీ కొన్ని ప్రత్యేక నిబంధనలు పెట్టింది. ఒకవేళ పాకిస్థాన్ సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తే, కోల్‌కతాలో జరగాల్సిన సెమీ ఫైనల్-1ను కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియానికి మారుస్తారు. పాక్ ఫైనల్‌కు చేరినా, అహ్మదాబాద్‌కు బదులుగా కొలంబోలోనే తుదిపోరు నిర్వహిస్తారు. ఒకవేళ సెమీ ఫైనల్‌లో భారత్-పాకిస్థాన్ తలపడితే ఆ మ్యాచ్ కొలంబోలో జరుగుతుంది. పాకిస్థాన్ కాకుండా మరే ఇతర జట్టుతోనైనా భారత్ సెమీ ఫైనల్ ఆడితే, ఆ మ్యాచ్‌కు ముంబై ఆతిథ్యం ఇస్తుంది. డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న ముంబైలోని వాంఖడే స్టేడియంలో అమెరికాతో ఆడనుంది. అహ్మదాబాద్, చెన్నై, ఢిల్లీ, ముంబై, కోల్‌కతాతో పాటు శ్రీలంకలోని కొలంబో, క్యాండీ నగరాల్లోని స్టేడియాలు ఈ మ్యాచ్‌లకు వేదికలుగా నిలవనున్నాయి. భారత్‌లో ఈ టోర్నీ ప్రత్యక్ష ప్రసార హక్కులను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ దక్కించుకుంది. అభిమానులు తమ అభిమాన మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్ ఛానెళ్లలో చూడవచ్చు. డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను జియో హాట్‌స్టార్ సొంతం చేసుకుంది. జియో హాట్‌స్టార్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. అభిమానుల కోసం ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం, కన్నడ భాషలతో పాటు బెంగాలీ, భోజ్‌పురి, హర్యానవీ భాషల్లోనూ ప్రత్యేక కామెంటరీ ఫీడ్స్ అందుబాటులో ఉంటాయి. టీమిండియా ఆడే మ్యాచ్‌లు, సెమీ ఫైనల్స్, ఫైనల్ కోసం మరాఠీ, భారత సంకేత భాషలలోనూ ప్రసారాలుంటాయి. అంతేకాకుండా, మొబైల్ యూజర్ల కోసం వర్టికల్ లైవ్ ఫీడ్, 360-డిగ్రీ వ్యూ, మల్టీ-క్యామ్ వంటి ఆధునిక ఫీచర్లను కూడా జియో హాట్‌స్టార్ అందిస్తోంది.

టీంలు ఇలా..

గ్రూప్-ఎ: భారత్, అమెరికా, నమీబియా, నెదర్లాండ్స్, పాకిస్థాన్

గ్రూప్-బి: ఆస్ట్రేలియా, శ్రీలంక, జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్

గ్రూప్-సి: ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఇటలీ, నేపాల్

గ్రూప్-డి: దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్ఘానిస్థాన్, కెనడా, యూఏఈ

# అనురాగ్ ఠాకూర్‌పై నిషేధం ఎత్తివేత



నిషేధం కారణంగా దాదాపు పదేళ్లుగా క్రికెట్ వ్యవహారాలకు దూరమైన భారత క్రికెట్ నియంత్రణ మండలి మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న నిషేధాన్ని గురువారం అత్యున్నత న్యాయస్థానం ఎత్తివేసింది. దాంతో, బీసీసీఐ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు ఠాకూర్‌కు మార్గం సుగమమైంది. నిషేధం కారణంగా 2017 నుంచి క్రికెట్ వవ్యహారాలకు దూరమైన ఠాకూర్ తనకు ఊరట కల్పించాలని సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. గురువారం ప్రధాన న్యాయమూర్తి ఇందియా సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణకు చేపట్టింది. ఠాకూర్‌పై విధించిన నిషేధం జీవితకాలం కొనసాగదని, ఇప్పటికే ఆయన తొమ్మిదేళ్లు క్రికెట్ కార్యకలాపాలకు దూరమయ్యారని ధర్మాసనం పేర్కొంది. లోధా కమిటీ సిఫార్సులను తిరస్కరించినందుకు అనురాగ్ ఠాకూర్ నిషేధానికి గురయ్యారు. అప్పటి సీజేఐ టీఎస్ ఠాకూర్ ఆయనను బీసీసీఐ అధ్యక్ష స్థానం నుంచి తొలగించారు. బీసీసీఐలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొచ్చే ఉద్దేశంతో లోధా కమిటీ సిఫారసులు చేయగా.. ఠాకూర్ మాత్రం అంగీకరించలేదు. బీసీసీఐలో ప్రభుత్వ జోక్యంలేదని ఐసీసీకి తప్పులతో కూడిన నివేదిక సమర్పించారు. దాంతో, ధిక్కారం కింద ఆరోపణలు ఎదుర్కొన్న ఠాకూర్ క్షమాపణలు తెలిపారు. కానీ, జూలై నెల నుంచి ఆయనపై గురువారం వరకు నిషేధం కొనసాగింది.

## పాక్ బెదిరింపులకు భయపడం: సూర్య



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య జరగాల్సిన హై-వోల్టేజ్ మ్యాచ్‌పై నెలకొన్న సందిగ్ధతకు టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెరదించాడు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో టీమిండియా వైఖరి ఏంటో సూర్య స్పష్టం చేశాడు. మెగా టోర్నీ నేపథ్యంలో గురువారం జరిగిన కెప్టెన్ల సమావేశంలో పాల్గొన్న సూర్యను పాక్ బాయ్‌కాట్ గురించి ప్రశ్నించగా.. తనదైన శైలిలో బదులిచ్చాడు. 'మేం మ్యాచ్ ఆడటానికి సిద్ధంగా ఉన్నాం. మా ప్రణాళికల్లో ఎలాంటి మార్పు లేదు. మా ఆలోచనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. మేం వారితో ఆడబోమని ఎప్పుడూ చెప్పలేదు. పాకిస్థానే ఆడనని అంటోంది. పాక్‌తో మ్యాచ్‌కు సంబంధించిన మా ఫ్లైట్ టికెట్లు ఇప్పటికే బుక్ అయ్యాయి. మేం షెడ్యూల్ ప్రకారం కొలంబోకు వెళ్తున్నాం. మా షెడ్యూల్ ఖరారైంది. ముందుగా యూఎస్ఏ, తర్వాత నమీబియా, ఆ తర్వాత కొలంబోకు బయలుదేరుతాం' అని సూర్య చెప్పుకొచ్చాడు. కాగా, పాకిస్థాన్ జట్టు మైదానంలోకి రాకపోయినా.. భారత్ మాత్రం ఐసీసీ నిబంధనలను పాటించనుంది.

# పాకీల ప్లాన్.. తిప్పికొట్టిన భారత్!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ మ్యాచ్ ఆడకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ)ని ఇప్పటికే ఐసీసీ హెచ్చరించింది. భారీ జరిమానాతో పాటు ఆంక్షలు విధిస్తామని పరోక్షంగా మందలించింది. అయితే ఈ ఆంక్షలను తప్పించుకునేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఒక కొత్త చట్టపరమైన ఎత్తుగడకు సిద్ధమైంది. ఫోర్స్ ముజూర్ అనే నిబంధనను ఉపయోగించుకొని ఆంక్షలు తప్పించుకోవాలని పాకిస్థాన్ ప్రణాళికలు రచిస్తోంది. సాధారణంగా ఐసీసీ రూల్స్ ప్రకారం.. ఒక దేశం కావాలని మ్యాచ్ ఆడకపోతే భారీ జరిమానాలు, నిధుల నిలిపివేత వంటి కఠిన చర్యలు ఉంటాయి. అయితే, వీటి నుంచి తప్పించుకోవడానికి పీసీబీ 'ఫోర్స్ మజూర్' అనే నిబంధనను తెరపైకి తెస్తోంది. ఊహించని, తమ నియంత్రణలో లేని అసాధారణ పరిస్థితులు.. ఉదాహరణకు ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ నిషేధాలు ఎదురైనప్పుడు ఫోర్స్ మజూర్ ద్వారా ఒప్పంద బాధ్యతల నుంచి మినహాయింపు కోరవచ్చు. 'మేం ఆడటానికి సిద్ధంగా ఉన్నా.. మా ప్రభుత్వం అనుమతించడం లేదు. ఇది మా చేతుల్లో లేని అంశం' అని ఐసీసీకి చెప్పడం ద్వారా శిక్షలు, ఆంక్షల నుంచి తప్పించుకోవచ్చని పాక్ భావిస్తోంది. కాగా, పాకిస్థాన్ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. పాకిస్థాన్ చేస్తున్న ఈ వాదనలో పసలేదని భారత క్రికెట్ బోర్డు గట్టిగా వాదిస్తోంది. ఈ వ్యవహారంపై బీసీసీఐ అధికారి ఒకరు స్పందిస్తూ పాక్ ద్వంద్వ వైఖరిని ఎత్తిచూపారు. 'టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో ఆడకూడదని పాక్ ప్రభుత్వం నిర్ణయించిన రోజునే.. పాక్ అండర్-19 జట్టు భారత్‌తో మ్యాచ్ ఆడింది. ప్రభుత్వానికి నిజంగానే విధానపరమైన అభ్యంతరాలు ఉంటే.. ఆ మ్యాచ్ కూడా ఆడకుండా ఉండాలి కదా? ఒకచోట ఆడి, మరోచోట ఆడననడం కేవలం సాకులు చెప్పడమే'అని ఓ బీసీసీఐ అధికారి మీడియాతో అన్నాడు.







## చేజింగ్ కోసమే ఫీల్డింగ్ తీసుకున్నా

ముందుగా ఫీల్డింగ్ చేయాలనుకుంటున్నాం. ఈ టోర్నీలో ఇది ఒక ట్రెండ్‌గా మారింది. పిచ్ బాగున్నప్పుడు.. మనం ఎంత స్కోరును ఛేజ్ చేయాలో తెలియడం ఎప్పుడూ మంచిదే. గత మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే మేం బరిలోకి దిగాం. అద్భుతంగా ఆడిన మా టీం సభ్యులకు శుభాకాంక్షలు

-స్మృతి మంధాన

# ఐసీసీ ఆఫీసును బాంబులతో పేల్చేస్తాం: పాక్ యూట్యూబర్

టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య నెలకొన్న వివాదం ఇప్పుడు మరో స్థాయికి చేరుకుంది. మైదానంలో జరగాల్సిన పోరు కాస్త ఇప్పుడు తీవ్రస్థాయి బెదిరింపులకు దారితీసింది. పాకిస్థాన్‌కు చెందిన ఓ ప్రముఖ యూట్యూబర్ ఏకంగా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) కార్యాలయాన్ని బాంబులతో పేల్చివేస్తామంటూ బహిరంగంగా బెదిరింపులకు పాల్పడటం ఇప్పుడు క్రీడా ప్రపంచంలో కలకలం రేపుతోంది. ఫిబ్రవరి 15న శ్రీలంకలోని కొలంబోలో భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. అయితే ఐసీసీ దీనిపై తీవ్రంగా స్పందించింది. ఒకవేళ పాక్ జట్టు మ్యాచ్ ఆడకపోతే భారీ జరిమానాతో పాటు అంతర్జాతీయ క్రికెట్ నుంచి నిషేధించే అవకాశం ఉందని హెచ్చరించింది. ఐసీసీ తీసుకున్న ఈ కఠిన నిర్ణయంపై పాక్ అభిమానులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అర్సాన్ నాసిర్ అనే పాకిస్థాన్ యూట్యూబర్ సుమారు 15 నిమిషాల నిడివి గల వీడియోను విడుదల చేశాడు. అందులో ఐసీసీ, బీసీసీఐ అధికారులపై అసభ్య పదజాలంతో విరుచుకుపడ్డాడు. "ఐసీసీ ఆఫీసు దుబాయ్‌లో ఉంది కాబట్టే అది సురక్షితంగా ఉంది. అదే గనుక భారత్‌లో ఉండి ఉంటే, మా వాళ్లు ఇప్పటికే ఆ ఆఫీసును, చుట్టుపక్కల ప్రాంతాన్ని బాంబులతో పేల్చివేసేవారు" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ వీడియోలో భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఐసీసీ ఛైర్మన్ జై షాపై అత్యంత నీచమైన రీతిలో కామెంట్స్ చేశాడు.

## భారత్‌తో ఆడే ప్రసక్తే లేదు: పాక్ ప్రధాని

మ్యాచ్ సమయానికల్లా పాకిస్థాన్ యూటర్న్ తీసుకుంటుందని అంతా భావిస్తుండగా.. ఆ దేశ ప్రధాని షెహబాజ్ షెరీఫ్ తగ్గేదేలేదని ప్రకటించారు. భారత్‌తో మ్యాచ్‌ను ఎట్టిపరిస్థితుల్లో ఆడేది లేదని స్పష్టం చేశారు. ఒకవేళ పాకిస్థాన్ మ్యాచ్‌ను బహిష్కరిస్తే.. భారత్‌కు ఉచితంగా 2 పాయింట్లు లభిస్తాయి. అంతేకాకుండా, పాకిస్థాన్ నెట్ రన్ రేట్ కూడా భారీగా దెబ్బతింటుంది. వారి సూపర్ -8 అవకాశాలపై తీవ్ర ప్రభావం పడనుంది. అంతేకాకుండా ఐసీసీ నుంచి భారీ జరిమానాతో పాటు ఆంక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఇరు జట్లు సూపర్-8 దాటి సెమీఫైనల్, ఫైనల్‌కు చేరుకుంటే.. అప్పుడు కూడా పాక్ ఇదే నిర్ణయానికి కట్టుబడి ఉంటుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. లీగ్ దశలో భారత్ నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. ఫిబ్రవరి 7న ముంబైలో అమెరికాతో, ఫిబ్రవరి 12న న్యూఢిల్లీలో నమీబియాతో, ఫిబ్రవరి 15న కొలంబోలో పాకిస్థాన్‌తో.. చివరగా ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడనుంది. గ్రూప్ దశ తర్వాత టాప్-2 జట్లు సూపర్ 8 టోర్నీకి చేరుకుంటాయి.

ఈవార్తలు **ప్రజావాణి**

సంపాదకీయం

www.evarthalu.com

నేటి ఈవార్తలు


శుక్రవారం 6-2-2026

# ప్రజా సమస్యలు పట్టని పార్లమెంట్

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ అత్యున్నతమైనది. దేశ భవిష్యత్తును నిర్ణయించే చట్టాలు, కోట్లాది మంది సామాన్యుల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు ఇక్కడే జరుగుతాయి. కానీ, గత కొన్నేళ్లుగా పార్లమెంట్ పనితీరును గమనిస్తే, అది ప్రజా సమస్యల పరిష్కార వేదికగా కాకుండా, రాజకీయ పార్టీల పరస్పర విమర్శలకు, నినాదాలకు, వాయిదాల పర్వాలకు నిలయంగా మారుతోం దన్నది నగ్న సత్యం. ఒక్కో పార్లమెంట్ నిమిషానికి లక్షలాది రూపాయల ప్రజా ధనం ఖర్చవుతుంది. కానీ, ఉభయ సభల్లోనూ గంటల తరబడి జరుగుతున్న గందరగోళం వల్ల ఉత్పాదకత దారుణంగా పడిపోతోంది. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై ప్రభుత్వం స్పందించకపోవడం, ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులపై ప్రతిపక్షాలు చర్చకు సహకరించకపోవడం వల్ల సభలు అర్ధాంతరంగా వాయిదా పడుతున్నాయి. ఫలితంగా, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతాంగ సమస్యల వంటి కీలక అంశాలపై చర్చలు నామమాత్రంగా మారిపోతున్నాయి. ప్రజాస్వామ్యంలో చర్చలే ప్రాణం. ఏదైనా చట్టం చేసే ముందు దానిపై లోతైన అధ్యయనం, సభ్యుల మధ్య వాదోపవాదాలు జరగాలి. కానీ, ఇటీవల కాలంలో అత్యంత కీలకమైన బిల్లులు సైతం ఎటువంటి చర్చ లేకుండానే నిమిషాల వ్యవధిలో ఆమోదం పొందుతున్నాయి. ఇది రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. పార్లమెంటరీ కమిటీలకు బిల్లులను పంపే సంప్రదాయం కూడా క్రమంగా తగ్గిపోవడం ఆందోళనకరం. ప్రశ్నోత్తరాల సమయం అనేది ఎంపీలు నేరుగా మంత్రులను నిలదీసి సమాధానాలు రాబట్టే సమయం. కానీ, గందరగోళం వల్ల ఈ సమయం తరచుగా రద్దవుతోంది. దీనివల్ల గ్రామీణ సమస్యలు, స్థానిక అవసరాలు కేంద్రం దృష్టికి వెళ్లకుండా పోతున్నాయి. ఎంపీలు తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే అవకాశం కోల్పోతున్నారు. పార్లమెంట్‌లో ఒకప్పుడు అటల్ బిహారీ వాజ్‌పేయి, నెహ్రూ వంటి మహోన్నత నాయకులు విభేదించినా ఒకరినొకరు గౌరవించుకునేవారు. కానీ నేటి రాజకీయాల్లో 'తగ్గేదే లే' అన్న ధోరణి పెరిగింది. అధికార పక్షం మెజారిటీ గర్వంతో, ప్రతిపక్షం అడుగడుగునా అడ్డుతగలాలనే మొండితనంతో వ్యవహరిస్తున్నాయి. ప్రజా సమస్యల కంటే రాజకీయ ఆధిపత్యమే పరమావధిగా మారుతోంది. పార్లమెంట్ మళ్లీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలంటే కొన్ని సంస్కరణలు అనివార్యం. ఏడాదికి కనీసం ఇన్ని రోజులు పార్లమెంట్ జరగాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలి. బ్రిటన్ తరహాలో 'ప్రతిపక్షాల దినం' కేటాయించి, వారు కోరుకున్న అంశాలపై చర్చ జరిపే అవకాశం ఇవ్వాలి. సభను అడ్డుకునే సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలు కూడా తమ ప్రతినిధులు సభలో ఎలా ప్రవర్తిస్తున్నారో గమనించాలి. ఓటు వేసి గెలిపించిన ప్రజల గొంతుక పార్లమెంట్‌లో ప్రతిధ్వనించాలి. కేవలం ఎన్నికల స్టంట్లు, పరస్పర ఆరోపణలకే సభ పరిమితమైతే, సామాన్యుడికి ప్రజాస్వామ్యంపై నమ్మకం సడలిపోతుంది. రాజకీయ పక్షాలు తమ స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి, దేశాభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పార్లమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉంది.

**- ఈవార్తలు సంపాదకీయ విభాగం**





# తెలంగాణకు తీరని అన్యాయం

భారత ఆర్థిక వ్యవస్థకు తెలంగాణ ఒక కీలక ఇంజన్ వంటిది. హైదరాబాద్ వంటి గ్లోబల్ సిటీ నుంచి భారీగా ఆదాయం సమకూరుతున్నప్పటికీ, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర అవసరాలకు తగిన ప్రాధాన్యం లభించకపోవడం విచారకరం. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలను ప్రజలు ఎన్నుకున్నా, కేంద్ర కేబినెట్‌లో ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా, రాష్ట్రానికి కొత్తగా ఒక్క పెద్ద ప్రాజెక్టు కూడా దక్కకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో ఆశించిన మద్దతు లభించలేదు.

**హైదరాబాద్** సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు అందలేదు. మెట్రో రైలు రెండో దశ విస్తరణకు సంబంధించి ఎలాంటి స్పష్టమైన బడ్జెట్ కేటాయింపులు లేవు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఆశించిన గ్రాంట్లు లభించలేదు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే ప్రాజెక్టుల్లో రూ. 10,134 కోట్లు లభించగా, తెలంగాణకు సంబంధించి గణనీయమైన కొత్త మార్గాల ప్రకటన లేదు. తెలంగాణ ప్రజలు బీజేపీకి గణనీయమైన స్థానాలు ఇచ్చినప్పటికీ, వారు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో విఫలమయ్యారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కేంద్ర బొగ్గు గని శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వంటి కీలక నేతలు ఉన్నప్పటికీ, రాష్ట్ర విభజన హామీల అమలు లేదా కొత్త సంస్థల ఏర్పాటు విషయంలో బడ్జెట్ నిరాశనే మిగిల్చింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ ఎంపీలు సరైన ఒత్తిడి తీసుకురాలేదనేది నిజమని దీన్ని బట్టే అర్థం అవుతోంది. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు తగ్గడం వల్ల తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. జనవరి చివరి నాటికి రాష్ట్రానికి రావాల్సిన రూ. 22,782 కోట్ల కేంద్ర గ్రాంట్లలో కేవలం రూ. 4,000 కోట్లు మాత్రమే అందడం ఆందోళనకరం. రాష్ట్ర అప్పుల పరిమితిని కేంద్రం గతంలోనే తగ్గించడం వల్ల మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. అయితే, కేంద్ర మంత్రులు మాత్రం ఈ బడ్జెట్ వల్ల తెలంగాణకు పరోక్షంగా ప్రయోజనాలు కలుగుతాయని వాదిస్తున్నారు. కేంద్ర పన్నుల నుంచి రాష్ట్రానికి వచ్చే వాటా 13.5 శాతం పెరిగిందని, 2026-27లో ఇది రూ. 33,180 కోట్లకు చేరుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా పుణే, బెంగళూరు, చెన్నైలకు హై-స్పీడ్ రైల్ కారిడార్ల ప్రతిపాదనలు నగర అభివృద్ధికి దోహదపడతాయని బీజేపీ నేతలు చెబుతున్నారు. కానీ, నేరుగా తెలంగాణకు ఏం ఒరిగింది? అంటే మాత్రం కిమ్మనడం లేదు. కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు విషయంలో తెలంగాణకు మరోసారి అన్యాయం జరిగిందనేది నిర్వివాదాంశం. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రానికి కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. 8 మంది ఎంపీలు కేవలం పార్టీ ప్రయోజనాలకే కాకుండా, రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై గట్టిగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ, ఆ దిశగా ఏ చర్యలు లేకపోవడం దారుణం.

**- శ్రీనివాస్ పొదిళ్ల, హైదరాబాద్, ఆర్థిక విశ్లేషకుడు**

# టీనేజీకి సోషల్ మీడియా బ్యాన్!

16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించడం అనేది నేడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. పిల్లల మానసిక ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం అనివార్యం. పిల్లలు ఆడుకోవడానికి మైదానాలకు వెళ్లడం కంటే మొబైల్ స్క్రీన్లకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు పిల్లల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకుంటూ, వారిని డిజిటల్ వ్యసనంలోకి నెడుతున్నాయి. సోషల్ మీడియా వాడకం వల్ల 16 ఏళ్లలోపు పిల్లల్లో ఆందోళన, నిరాశ, ఒంటరితనం పెరుగుతున్నాయి. ఇతరుల కృత్రిమమైన మెరుపు జీవితాలతో తమను తాము పోల్చుకోవడం వల్ల పిల్లల్లో ఆత్మన్యూనతా భావం కలుగుతోంది. ఆన్‌లైన్ ప్రపంచం పిల్లలకు సురక్షితమైన ప్రదేశం కాదు.




సైబర్ బుల్లీయింగ్ కారణంగా అనేకమంది పిల్లలు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. అలాగే, సోషల్ మీడియా ద్వారా ఆన్‌లైన్ నేరగాళ్లు పిల్లలను సులభంగా లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. అతిగా సోషల్ మీడియా వాడటం వల్ల పిల్లల నిద్ర సమయం తగ్గిపోతోంది, ఇది వారి శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. శారీరక శ్రమ తగ్గడం వల్ల ఊబకాయం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీన్ని గ్రహించిన ఆస్ట్రేలియా 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధిస్తూ ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా చట్టం చేసింది. ఇది అమలులోకి వచ్చిన కేవలం రెండు నెలల్లోనే సుమారు 47 లక్షల అకౌంట్లను ప్లాట్‌ఫారమ్‌లు తొలగించాయి. స్పెయిన్ ప్రధాని సోషల్ మీడియాను 'నియంత్రణ లేని అడవి'గా అభివర్ణిస్తూ, 16 ఏళ్లలోపు వారికి నిషేధం విధించనున్నట్లు ప్రకటించారు. బ్రిటన్‌లోని అనేకమంది ఎంపీలు కూడా ఇటువంటి నిషేధం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్‌లోనూ 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణలు విధించే అంశంపై ప్రభుత్వం చర్చలు జరపాలి. చట్టబద్ధమైన నిషేధం ఎంత ముఖ్యమో, పిల్లలకు డిజిటల్ అక్షరాస్యత కల్పించడం కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియాలోని లోటుపాట్లను పిల్లలకు వివరించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలి.

**- డాక్టర్ లలిత దీకొండ, సైకియాట్రిస్టు**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.